# విశాల భారతి

తెలుగు దినపత్రిక

29-04-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

బుధవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 117


# నేడే టెన్త్ ఫలితాలు

- ఈరోజు మధ్యాహ్నం 2 గంటలకు విడుదల
- విడుదల చేయనున్న కే. కేశవరావు ,యోగితారాణా
- మొత్తం 5.28 లక్షల మంది విద్యార్థులు
- మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు జరిగాయి
- అధికారిక వెబ్‌సైట్లలో హాల్ టికెట్ నంబర్‌తో చూడొచ్చు
- ఫెయిల్ అయిన వారికి త్వరలోనే ప్రత్యేక పరీక్షలు




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్న తరుణం రానే వచ్చింది. పదో తరగతి విద్యా ప్రస్థానంలో కీలక ఘట్టమైన వార్షిక పరీక్షల ఫలితాల వెల్లడికి విద్యాశాఖ సర్వం సిద్ధం చేసింది. రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, ఈరోజు మధ్యాహ్నం సరిగ్గా రెండు గంటలకు ఫలితాలు విడుదల కానున్నాయి. ఈ మేరకు ఇప్పటికే అధికారికంగా ప్రకటన

మిగతా 3లో..

## ఫ్యూచర్ సిటీ భవిష్యత్

# తరాలకు వరం



- దేశంలో 4వ అతిపెద్ద నగరంగా అభివృద్ధి
- జూన్ 2లోపు కమిషనరేట్ భవనం పూర్తి
- భూములిచ్చిన వారికి పూర్తి భరోసా
- ముంబైకి బుల్లెట్ ట్రైన్, మెగా బస్ టెర్మినల్
- ఫార్మాసిటీ స్థానంలో కాలుష్య రహిత నగరం
- అభివృద్ధి చూసి విపక్షాలు ఏడుస్తున్నాయని విమర్శ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ రూపురేఖలను సమూలంగా మార్చివేసేలా నిర్మించ తలపెట్టిన 'భారత్ ఫ్యూచర్ సిటీ' భవిష్యత్తు తరాలకు ఒక గొప్ప వరమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ప్రపంచస్థాయి నగరాలతో పోటీపడేలా ఈ నగరాన్ని తీర్చిదిద్దుతామని, జూన్ రెండో తేదీలోపు ఇక్కడి భవన నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేస్తామని ఆయన ప్రకటించారు. రంగారెడ్డి జిల్లా మీర్ ఖాన్ పేట్ వేదికగా ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ భవన నిర్మాణానికి ఆయన భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, ఫ్యూచర్ సిటీని దేశంలోనే నాలుగో అతిపెద్ద నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఉండే అత్యాధునిక వసతులతో ఈ నగరం రూపుదిద్దుకోనుందని, అయితే దీని నిర్మాణం అనేది అంత సులభమైన విషయం కాదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం, అధికారులు, ప్రజలు అందరూ కలిసికట్టుగా శ్రమిస్తేనే ఇలాంటి భారీ ప్రాజెక్టులు సాధ్యమవుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఫ్యూచర్ సిటీకి వస్తున్న ఆదరణ చూసి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా తమ ప్రాంతాలను ఇందులో కలపాలని డిమాండ్ చేస్తున్నారని ఆయన వివరించారు. ప్రజలను అభివృద్ధిలో భాగస్వాములను చేస్తూ ముందుకు సాగడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో హైటెక్ సిటీ నిర్మాణాన్ని ప్రారంభించినప్పుడు చాలా మంది అవహేళన చేశారని, విమర్శలు గుప్పించారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. కానీ నేడు అదే హైటెక్ సిటీ ప్రపంచస్థాయి ఐటీ ఐకానిక్ సెంటర్‌గా నిలిచి హైదరాబాద్ గర్వించదగ్గ స్థాయికి చేరుకుందని ఆయన కొనియాడారు. హైదరాబాద్ నగరానికి ఉన్న భౌగోళిక అనుకూలతలు మరే నగరానికీ లేవని, ఇక్కడ ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు నగర అభివృద్ధికి వెన్నెముకగా నిలిచిందని చెప్పారు.

మిగతా 3లో..

# కాళేశ్వరం.. సీబీఐని కదిలించడం ఎలా?

## ప్రాజెక్టు అక్రమాలపై సీబీఐ దర్యాప్తు కోసం పట్టు

- కోర్టు స్టే దృష్ట్యా విజిలెన్స్ రిపోర్టుల ఆధారంగా విచారణ
- విచారణ జరపకపోతే బీజేపీ-బీఆర్ఎస్ ఒక్కటేనని ప్రచారం
- రేవంత్ స్వయంగా సీబీఐ డైరెక్టర్‌ను కలిసి ఆధారాలిచ్చే యోచన
- కక్ష సాధింపు ముద్ర పడకుండా కేంద్రం ద్వారానే బీఆర్ఎస్‌కు చెక్
- విచారణ జరిగినా, జరగకపోయినా కాంగ్రెస్‌కే లాభం



**తెలంగాణ రాజకీయాల్లో కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ అల్లుకున్న వివాదాలు మరోసారి పెను దుమారం రేపుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య సాగుతున్న ఈ మాటల యుద్ధం ఇప్పుడు హస్తిన వేదికగా కొత్త మలుపు తిరగబోతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వ్యవహారాన్ని కేవలం రాష్ట్ర స్థాయి అంశంగా పరిమితం చేయకుండా, జాతీయ స్థాయిలో చర్చనీయాంశం చేసేందుకు పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తున్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో జరిగినట్లుగా భావిస్తున్న అక్రమాలు, నిధుల మళ్లింపుపై కేంద్ర దర్యాప్తు సంస్థ చేత విచారణ జరిపించాలన్న పట్టుదలతో ఆయన ఉన్నట్లు కనిపిస్తోంది. దీనివల్ల అటు గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు, ఇటు కేంద్రంలోని బీజేపీ తీరును కూడా ప్రజల ముందు దోషిగా నిలబెట్టవచ్చనేది ఆయన ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.**

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ప్రాజెక్టు అక్రమాలపై ఇప్పటికే రాష్ట్రస్థాయిలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం విస్తృత స్థాయి విచారణ జరిపి పలు కీలక ఆధారాలను సేకరించింది. అయితే, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై న్యాయపరమైన చిక్కులు ఎదురవడంతో రేవంత్ ప్రభుత్వం అత్యంత చాకచక్యంగా వ్యవహరిస్తోంది. కోర్టు ఉత్తర్వుల వల్ల ఏర్పడిన అడ్డంకులను అధిగమిస్తూనే, సీబీఐ విచారణకు మార్గం సుగమం చేసేలా ప్రత్యేక నివేదికను సిద్ధం చేసింది. ఘోష్ కమిషన్ రిపోర్టుతో సంబంధం లేకుండా, అంతకుముందే వెలుగులోకి వచ్చిన విజిలెన్స్ రిపోర్టును, కాగ్ లేవనెత్తిన అభ్యంతరాలను ప్రాతిపదికగా తీసుకుని ముందుకు వెళ్లాలని నిర్ణయించింది. ఈ వ్యూహం ద్వారా న్యాయపరమైన చిక్కులు రాకుండా జాగ్రత్త పడుతూనే, కేంద్రంపై ఒత్తిడి పెంచేలా పావులు కదుపుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఢిల్లీ పర్యటనకు సిద్ధమవుతుండటం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఆయన నేరుగా సీబీఐ డైరెక్టర్‌ను కలిసి, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన భారీ కుంభకోణంపై

మిగతా 2లో..

# బెంగాల్‌లో రెండో విడత పోలింగ్

- బుధవారం 142 స్థానాలకు తుది పోలింగ్
- మమతా బెనర్జీ, సువేందు అధికారుల పరీక్ష
- 3.21 కోట్ల మంది ఓటు వేయనున్నారు
- బీజేపీ అభివృద్ధి వర్సెస్ మమత సంక్షేమం
- గొడవలు జరగకుండా భారీ కేంద్ర బలగాలు
- మే 4న బెంగాల్ విజేత ఖరారు



**విశాలభారతి, జాతీయం:**

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రణరంగం ఇప్పుడు అత్యంత ఉత్కంఠభరితమైన ముగింపు దశకు చేరుకుంది. మొత్తం 294 అసెంబ్లీ స్థానాలకు గాను ఇప్పటికే తొలి విడత పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగియగా, బుధవారం జరగనున్న రెండో, చివరి విడత పోలింగ్ కోసం ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ విడతలో ఏకంగా 142 నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహిస్తుండటంతో, కోల్‌కతా పీఠాన్ని అధిరోహించేది ఎవరనే అంశంపై ఈ పోరే తుది నిర్ణయాత్మకం కానుంది. రాజకీయ విశ్లేషకులు సైతం ఈ దశను బెంగాల్ భవితవ్యాన్ని తేల్చే అసలైన సమరంగా అభివర్ణిస్తున్నారు. ఈ దఫాలో కోల్‌కతా నగరం సహా ప్రధానమైన ఏడు జిల్లాల్లో పోలింగ్ జరగనుండటంతో దాదాపు 3.21 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. దేశ రాజకీయాల్లో ఆసక్తి రేపుతున్న ఈ పోరులో గెలుపు గుర్రం ఎక్కేందుకు ప్రధాన పార్టీలన్నీ సర్వశక్తులు ఒడ్డాయి. ముఖ్యంగా కేంద్రంలోని అధికార భారతీయ జనతా పార్టీ ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా బెంగాల్ గడ్డపై కమలం జెండాను ఎగురవేయాలని పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. గత కొన్నేళ్లుగా తృణమూల్ కాంగ్రెస్ అరాచక పాలనతో రాష్ట్రం వెనుకబడిపోయిందని, పారిశ్రామికీకరణ కుంటుపడిందని బీజేపీ నాయకత్వం తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. అభివృద్ధిని కాంక్షించే ఓటర్లు మార్పు వైపు చూస్తున్నారన్న నమ్మకంతో బీజేపీ తన ప్రచారాన్ని హోరెత్తించింది. అయితే, కేంద్రం నుంచి ఎదురవుతున్న ఈ సవాలును ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దీటుగా ఎదుర్కొంటున్నారు. బెంగాల్ సంస్కృతిని కాపాడేందుకు 'బెంగాల్ కూతురు' అనే నినాదంతో ఆమె ప్రజల్లోకి వెళ్లారు. బీజేపీ నాయకులను బయటి వ్యక్తులుగా అభివర్ణిస్తూ, స్థానిక సెంటిమెంటును రగిల్చే ప్రయత్నం చేశారు.

మిగతా 3లో..



# రాష్ట్రంలో 5 కొత్త ఎయిర్‌పోర్టులు

- జక్రాన్‌పల్లి, అంతర్గావ్, కొత్తగూడెం, ఆదిలాబాద్, వరంగల్
- ఇప్పటికే డీపీఆర్ దశలో ఉన్న పనులు
- మిగతా చోట్ల భూసేకరణే ప్రధాన అడ్డంకి
- భద్రతా కారణాలతో సీఎం జిల్లాకు నిరాకరణ
- కొండలు ఉండటం, శంషాబాద్‌కు దగ్గరగా ఉండటం

03

# తెలంగాణ కొత్త డీజీపీగా సీవీ ఆనంద్

- సీవీ ఆనంద్ 1991 బ్యాచ్
- రెండేళ్ల పాటు పదవిలో కొనసాగింపు
- రాష్ట్రానికి 3వ పూర్తిస్థాయి డీజీపీ
- ఏప్రిల్ 31న రిటైర్ కానున్న శివధర్ రెడ్డి
- హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియామకం
- మే 1, 2026 నుండి కొత్త బాధ్యతలు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర పోలీస్ దళానికి నూతన సారథి ఎంపిక ప్రక్రియ ఎట్టకేలకు ఒక కొలిక్కి వచ్చింది. రాష్ట్ర నూతన డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్‌ను నియమిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గత కొంతకాలంగా రాష్ట్రంలో పూర్తిస్థాయి డీజీపీ నియామకంపై నెలకొన్న ఉత్కంఠకు ఈ ఉత్తర్వులతో తెరపడింది. 1991 బ్యాచ్‌కు చెందిన ఆనంద్ ప్రస్తుతం హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పరిపాలనాపరంగా ఎంతో అనుభవం ఉన్న ఆయనను అత్యున్నత పదవికి ఎంపిక చేయడం ద్వారా ప్రభుత్వం శాంతిభద్రతల పరిరక్షణపై తనకున్న చిత్తశుద్ధిని చాటుకుంది. ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి పదవీ కాలం ఏప్రిల్ 31వ తేదీతో ముగియనుంది. ఆయన పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ కీలక నియామకాన్ని చేపట్టింది. సీవీ ఆనంద్ పూర్తిస్థాయి డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన రోజు నుండి రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. సుదీర్ఘ కాలం తర్వాత ఒక అధికారికి పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించడం వల్ల పోలీస్ శాఖలో స్థిరత్వం ఏర్పడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో శాంతిభద్రతల పర్యవేక్షణలో కీలక పాత్ర పోషించిన అధికారుల్లో ఆనంద్ ఒకరుగా పేరు తెచ్చుకున్నారు. రాష్ట్ర చరిత్రను పరిశీలిస్తే గత కొంతకాలంగా పూర్తి కాలపు డీజీపీ నియామకం జరగలేదు. ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డితో పాటు గతంలో పనిచేసిన

మిగతా 2లో..



# జీహెచ్ఎంసీలో భారీ స్కామ్

- పని చేయకుండానే జీతాలు పొందుతున్న సిబ్బంది
- ఫేషియల్ సిస్టమ్‌లోనూ మోసపూరిత హాజరు
- రెండు సర్కిళ్లలో 89 మంది అస్సలు రావడం లేదు
- కొత్త వారి నుంచి రూ.2 లక్షల వరకు ముడుపులు
- సిబ్బంది లేక పారిశుధ్యం అస్తవ్యస్తం
- అక్రమార్కులపై కఠిన చర్యలకు అధికారుల ఆదేశం

03

# రైతాంగాన్ని కాంగ్రెస్ మోసం చేస్తుంది

- కాంగ్రెస్ డిక్లరేషన్ హామీలు నెరవేర్చలేదని విమర్శ
- మే 6న రైతు సమస్యలపై జరిగే సభకు హాజరు
- ఆత్మహత్యలు, కొనుగోళ్లలో వైఫల్యంపై ఆవేదన
- గ్రేటర్ వరంగల్ మున్సిపల్ ఎన్నికలపై దిశానిర్దేశం
- బూత్ స్థాయిలో కొత్త ఓటర్ల నమోదుకు పిలుపు
- రైతుల పక్షాన క్షేత్రస్థాయి పోరాటాలకు సిద్ధం




02

# అక్రమ కేసులు బంజెయ్

## జైల్లో ఉన్న బీఆర్ఎస్ నేత క్రిశాంక్‌కు ధైర్యం చెప్పారు

- ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టడం ఆపాలని డిమాండ్
- ఫోన్లు, సీసీ కెమెరాలను ప్రభుత్వం హ్యాక్ చేస్తోందని ఆరోపణ
- ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే పర్యవేక్షించాలని సూచన
- ఆరు గ్యారంటీల అమలుపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని విమర్శ
- ఎన్ని కేసులు పెట్టినా ప్రజా పోరాటం ఆగదని స్పష్టీకరణ



02

# అక్రమ కేసులు బంజేయ్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రభుత్వంపై చేసిన ఘాటు వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. సంగారెడ్డి జిల్లా కంది జైలులో రిమాండ్‌లో ఉన్న బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌ను మంగళవారం ఆయన పరామర్శించారు. ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్ రావు, ఎర్రోళ్ల శ్రీనివాస్‌లతో కలిసి జైలుకు వెళ్లిన ఆయన, క్రిశాంక్‌కు ధైర్యం చెప్పారు. అనంతరం జైలు వెలుపల మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అక్రమ కేసులు పెట్టడం మానేసి, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై దృష్టిసారించాలని ఆయన హితవు పలికారు. రైతుల సమస్యలను గాలికొదిలేసి కేవలం రాజకీయ కక్ష సాధింపులకే ప్రాధాన్యత ఇస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ప్రశ్నించే గొంతులను అణచివేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. క్రిశాంక్‌తో పాటు మరో ఏడుగురు బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపడం అన్యాయమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఏడో గ్యారంటీగా 'ప్రశ్నించే హక్కు' కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్, ఇప్పుడు అధికారం చేపట్టాక ఎవరైనా మాట్లాడితే విజిలెన్స్, సీఐడీ విచారణల పేరుతో వేధిస్తోందని మండిపడ్డారు. అభివృద్ధి పట్ల, ప్రజల సంక్షేమం పట్ల ప్రభుత్వానికి కనీస పట్టింపు లేదని, అహంకారపూరితమైన రాచరిక ధోరణితో పాలన సాగిస్తున్నారని విమర్శించారు. కేవలం కమిషన్లు, అక్రమ వసూళ్ల కోసమే ఈ ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఫేక్ వార్తలపై ఫిర్యాదు చేసిన వారినే జైలుకు పంపడం ఎక్కడి న్యాయమని హరీశ్‌రావు ప్రశ్నించారు. కేసీఆర్, కేటీఆర్ మీద తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అందుకు సంబంధించిన మొబైల్ ఆధారాలను క్రిశాంక్ పోలీసులకు అందజేస్తే, రివర్స్ లో ఆయనపైనే కేసులు పెట్టారని మండిపడ్డారు. తప్పుడు వార్తలు సృష్టించిన వారిని నోటీసులు ఇచ్చి ఇంటికి పంపించి, ఫిర్యాదుదారుడిపై 308 సెక్షన్ కింద నాన్ బెయిలబుల్ కేసులు పెట్టడం ప్రజాస్వామ్యమా అని నిలదీశారు. ఫోన్ అప్పగిస్తే హత్యాయత్నం కేసులు పెడతారా అని నిప్పులు చెరిగారు. మేజిస్ట్రేట్ ఒక కేసును కొట్టివేసినా, మళ్లీ కొత్త కేసులు సృష్టించి జైల్లో ఉంచడం ప్రభుత్వ కక్ష సాధింపునకు నిదర్శనమని ధ్వజమెత్తారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడమే క్రిశాంక్ చేసిన తప్పా అని హరీశ్‌రావు అడిగారు. అంగన్‌వాడీ మొబైల్ స్కాం, పదో తరగతి ప్రశ్నపత్రం లీకేజీ, గచ్చిబౌలి భూముల వ్యవహారం, మిస్ ఇంగ్లండ్ విషయంలో కాంగ్రెస్ తీరును ప్రశ్నించినందుకు వరుసగా కేసులు పెడుతున్నారని వివరించారు. రాజ్యాంగం కల్పించిన భావప్రకటనా స్వేచ్ఛను ఈ ప్రభుత్వం కాలరాస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనుముల మహానందరెడ్డి వంటి వారు కీలక కేసుల్లో ఉన్నప్పటికీ వారిని వదిలేసి, కేవలం బీఆర్ఎస్ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకోవడం వివక్షేనని అన్నారు. ప్రశ్నించడం నేరమైతే తాము ఆ నేరాన్ని పదేపదే చేస్తామని, ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వంపై విమర్శలు చేస్తూనే, కొందరు ఐపీఎస్ అధికారుల తీరును హరీశ్‌రావు తీవ్రంగా తప్పుబట్టారు. జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో కూర్చుని తానే రాజును అనుకుంటే కుదరదని, ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలో వంద కోట్లతో కొత్త ప్యాలెస్ నిర్మించుకోవడానికే సమయం సరిపోతోందని ఎద్దేవా చేశారు. కొంతమంది అధికారులు తమ ఫోన్లు, ఇళ్ల ముందున్న సీసీ కెమెరాలను హ్యాక్ చేయిస్తున్నారని ఆరోపించారు. బెంగళూరు నుంచి ప్రైవేట్ హ్యాకర్లను రప్పించి కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా నిఘా పెడుతున్నారని, ఇందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. రిటైర్ అయినా సరే చట్టం నుండి తప్పించుకోలేరని అధికారులను హెచ్చరించారు. రైతుల పరిస్థితి రాష్ట్రంలో అత్యంత దయనీయంగా తయారైందని మాజీ మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. యాసంగి సన్నవడ్లకు బోనస్ ఇస్తారా లేదా అన్నది ముఖ్యమంత్రి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద లారీలు రోజులుగా నిలిచిపోయాయని, రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోలేక అవస్థలు పడుతున్నారని వివరించారు. శనగలు, పొద్దుతిరుగుడు రైతులు గత 20 రోజులుగా కేంద్రాల వద్దే పడిగాపులు కాస్తున్నారని, మంత్రులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మక్కలు కొనేవారు లేక రైతులు దళారుల చేతుల్లో మోసపోతున్నారని, ప్రభుత్వం పెట్టిన కొత్త షరతులు రైతుల నడ్డి విరుస్తున్నాయని మండిపడ్డారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని తెలుసుకోవడానికి ముఖ్యమంత్రి ఒక్కసారి కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని హరీశ్‌రావు కోరారు. ఎకరాకు 26 క్వింటాళ్లే కొంటామన్న నిబంధన వల్ల పండించిన పంటలో సగం కూడా ప్రభుత్వం కొనడం లేదని విమర్శించారు. వడ్ల కొనుగోలు కేంద్రాలు ఇంకా పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదని, ప్రారంభమైన చోట తాలు పేరుతో కోతలు విధిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతుల కష్టాలను తీర్చాలని, లేదంటే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. పాలనపై సోయి పెంచుకొని అన్నదాతలను ఆదుకోవాలని, కనీస మద్దతు ధర అందేలా చూడాలని డిమాండ్ చేశారు. క్రిశాంక్ పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని హరీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీటీ వారెంట్ల పేరుతో మళ్లీ జైలుకు పంపాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. క్రిశాంక్ బయటకు వస్తే మళ్లీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాడని భయపడుతున్నారా అని ముఖ్యమంత్రిని ఉద్దేశించి అన్నారు. జైల్లో పెట్టి గొంతు నొక్కడం సాధ్యం కాదని, ఒక్క క్రిశాంక్‌ను ఆపినా లక్షలాది మంది బీఆర్ఎస్ కార్యకర్తలు గొంతు ఎత్తుతారని తెలిపారు. నిరంకుశ చర్యలతో తెలంగాణ ఉద్యమకారుల స్ఫూర్తిని దెబ్బతీయలేరని, ఎన్ని కష్టాలు ఎదురైనా ప్రజల పక్షాన నిలబడతామని ఆయన పునరుద్ఘాటించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాల్సిన ఆరు గ్యారంటీలపై దృష్టి పెట్టకుండా, బీఆర్ఎస్ పార్టీని ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా పెట్టుకుందని హరీశ్‌రావు ఆరోపించారు. అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైతే కాలగర్భంలో కలిసిపోక తప్పదని పేర్కొన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించామని, కానీ ప్రస్తుత ప్రభుత్వం అరాచకాలకు పాల్పడుతోందని విమర్శించారు. రైతుల రుణమాఫీ, మహిళలకు భృతి వంటి ప్రధాన హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజల కోసం పుట్టిన పార్టీ అని, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన పార్టీ అని హరీశ్‌రావు గుర్తు చేశారు. తాము కమీషన్ల కోసమో, దందాల కోసమో అధికారంలోకి రాలేదని, కేవలం ప్రజల ప్రయోజనాలే తమకు ముఖ్యమని స్పష్టం చేశారు. విద్యార్థులు, నిరుద్యోగులు, రైతుల పక్షాన పోరాటం కొనసాగుతూనే ఉంటుందని చెప్పారు. అన్యాయానికి గురవుతున్న పీడితుల పక్షాన నిలబడటమే తమ సిద్ధాంతమని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా తమ గళం వినిపిస్తూనే ఉంటామని ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ప్రజల మద్దతుతో మళ్లీ ప్రజా ప్రభుత్వం ఏర్పడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



# రైతాంగాన్ని కాంగ్రెస్ మోసం చేస్తుంది

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

వరంగల్‌లో రైతు డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని, రాష్ట్ర రైతాంగాన్ని ఆ పార్టీ అన్ని రకాలుగా వంచించిందని భారత్ రాష్ట్ర సమితి కార్య నిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారకరామారావు తీవ్రంగా ధ్వజమెత్తారు. దాదాపు నాలుగేళ్ల క్రితం వరంగల్ వేదికగా అనేక వాగ్దానాలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, రెండున్నర ఏళ్లు గడుస్తున్నా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని ఆయన విమర్శించారు. రైతుల కష్టాలను గాలికొదిలేసి తన కపట రాజకీయాలను కొనసాగిస్తోందని ఆరోపిస్తూ, ప్రజలకు వాస్తవాలను వివరించాల్సిన సమయం ఆసన్నమైందని కేటీఆర్ స్పష్టం చేశారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీ స్వయంగా వరంగల్ డిక్లరేషన్ ప్రకటించి తెలంగాణ రైతన్నలను మోసగించారని, ఆ చారిత్రక ద్రోహాన్ని గుర్తుచేసేందుకే మే 6వ తేదీన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. మే 6న వరంగల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన రైతు ఆవేదన సభకు తాను హాజరవుతున్నట్లు ఆయన ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు, రైతన్నల సమస్యలపై సమరశంఖం పూరించేందుకు ఈ వేదికను వినియోగించుకుంటామని, పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం పగ్గాలు చేపట్టినప్పటి నుంచి వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, విత్తనాలు మరియు ఎరువుల కొరతతో రైతులు రోడ్ల పైకి రావాల్సిన దుస్థితి ఏర్పడిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ హయాంలో ఎంతో క్రమబద్ధంగా జరిగిన ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ప్రస్తుతం అస్తవ్యస్తంగా మారిందని, రైతులు కల్లాల వద్దే పడిగాపులు కాస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పండించిన పంటను అమ్ముకోవడానికి కూడా రైతులు పోరాటాలు చేయాల్సి రావడం కాంగ్రెస్ పాలనా వైఫల్యానికి నిదర్శనమని ఆయన ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కె. చంద్రశేఖర రావు నాయకత్వంలో రైతు ఆత్మహత్యలు అనే మాటే వినపడకుండా పోయిందని, కానీ ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో ఆ చీకటి రోజులు మళ్లీ మొదలయ్యాయని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉదాసీనత, ఆర్థిక సాయం అందకపోవడంతో అన్నదాతలు ప్రాణాలు తీసుకోవడం తనను కలిచివేస్తోందని ఆయన అన్నారు. కరెంటు కోతలతో పంటలు ఎండిపోతున్నా, గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోతున్నా పాలకులు మాత్రం సమీక్షలకే పరిమితమయ్యారని, క్షేత్రస్థాయిలో రైతుల బాధలను వినే నాథుడే కరువయ్యారని ఆయన విమర్శించారు. రైతాంగానికి ఎదురవుతున్న ప్రతి సమస్యపై భారత్ రాష్ట్ర సమితి అండగా ఉంటుందని, వారి హక్కుల సాధన కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని కేటీఆర్ పునరుద్ఘాటించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియలో తలెత్తుతున్న జాప్యాన్ని ఆయన ప్రస్తావిస్తూ, స్థానిక నేతలు ఈ అంశంపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతుల పక్షాన నిలబడి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు ఆయన దిశా నిర్దేశం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ నేతలతో జరిగిన ఈ కీలక సమావేశంలో పార్టీ సంస్థాగత బలోపేతంపై కేటీఆర్ సుదీర్ఘంగా చర్చించారు. పార్టీని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేందుకు అవసరమైన కార్యాచరణను రూపొందించాలని, ప్రతి గ్రామంలోనూ పార్టీ జెండా రెపరెపలాడాలని ఆయన కోరారు. ఉమ్మడి జిల్లాలోని తాజా రాజకీయ పరిస్థితులు, ప్రజల అభిప్రాయాలను నేతలు కేటీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన, ప్రజా సమస్యలే ఎజెండాగా ముందుకు సాగాలని, పార్టీని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, పాత కమిటీల స్థానంలో క్రియాశీలక కార్యకర్తలతో నూతన కమిటీలను వెంటనే ఏర్పాటు చేయాలని కేటీఆర్ ఆదేశించారు. సంస్థాగత నిర్మాణం బలంగా ఉన్నప్పుడే ఏ ఎన్నికలనైనా ధీటుగా ఎదుర్కోగలమని ఆయన నేతలకు వివరించారు. సభ్యత్వ నమోదు ప్రక్రియలో యువతకు, మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి ఇంటికీ వెళ్లి పార్టీ చేస్తున్న కార్యక్రమాలను వివరించాలని సూచించారు. ఈ క్రమంలో త్వరలో జరగనున్న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల వ్యూహంపై కూడా నేతలతో చర్చలు జరిపారు. గ్రేటర్ వరంగల్ ఎన్నికల్లో భారీ విజయం సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని, అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచారం వరకు అంతా ఒక ప్రణాళికాబద్ధంగా జరగాలని కేటీఆర్ సూచించారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, నగర అభివృద్ధికి బీఆర్ఎస్ చేసిన కృషిని మరోసారి గుర్తుచేయాలని ఆయన పేర్కొన్నారు. వరంగల్ నగర అభివృద్ధికి తాము కేటాయించిన నిధులు, చేపట్టిన పనులను వివరించడంతో పాటు, ప్రస్తుత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టాలని సూచించారు. ప్రతి డివిజన్ స్థాయిలో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసి ఎన్నికల వేడిని ఇప్పుడే ప్రారంభించాలని కోరారు. ఎన్నికల సంఘం చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సీ రివిజన్ కార్యక్రమాన్ని పార్టీ నేతలు అత్యంత ప్రాధాన్యత అంశంగా పరిగణించాలని కేటీఆర్ నొక్కి చెప్పారు. ఓటర్ల జాబితాలో జరిగే మార్పులు చేర్పుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా దొంగ ఓట్ల నమోదును అరికట్టడానికి ప్రతి బూత్ స్థాయిలో కార్యకర్తలు నిఘా ఉంచాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చూడటం మన బాధ్యతని, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియలో చురుగ్గా పాల్గొనాలని ఆయన కోరారు. ఓటు హక్కు కోల్పోయిన వారి వివరాలను సేకరించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని వివరించారు. ఓటర్ల జాబితా సవరణ కోసం బూత్ లెవల్ సహాయకుల జాబితాను తక్షణమే సిద్ధం చేయాలని, వారు ప్రభుత్వ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని కేటీఆర్ సూచించారు. ఏ ఒక్కరి ఓటు కూడా అన్యాయంగా తొలగించబడకుండా జాగ్రత్త వహించాలని, రాజకీయ ప్రత్యర్థులు చేసే కుతంత్రాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో బూత్ కమిటీలు బలంగా ఉంటేనే ఎన్నికల రోజున అనుకూల ఫలితాలు సాధించగలమని ఆయన నేతలకు గుర్తుచేశారు. ఈ రివిజన్ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటి సమాచారాన్ని సేకరించి పార్టీకి అనుకూలమైన ఓటు బ్యాంకును పటిష్టం చేసుకోవాలని అన్నారు.




# కాళేశ్వరం.. సీబీఐని కదిలించడం ఎలా?

**మొదటిపేజీ తరువాయి**

ఆధారాలను సమర్పించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఒకవేళ ముఖ్యమంత్రి వెళ్లడం వీలు కాకపోతే, రాష్ట్ర మంత్రుల బృందాన్ని పంపి కేంద్ర హోంశాఖపై ఒత్తిడి తీసుకురావాలని భావిస్తున్నారు. కేవలం లేఖలు రాసి సరిపెట్టుకోకుండా, వ్యక్తిగతంగా భేటీ కావడం ద్వారా ఈ అంశంపై తమ ప్రభుత్వం ఎంత చిత్తశుద్ధితో ఉందో చాటిచెప్పాలని రేవంత్ యోచిస్తున్నారు. దీనివల్ల కేంద్రం ఈ విజ్ఞప్తిని తోసిపుచ్చడం అంత సులభం కాదనేది కాంగ్రెస్ వర్గాల విశ్లేషణగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం నేరుగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబంపై లేదా బీఆర్ఎస్ అగ్రనేతలపై కఠిన చర్యలు తీసుకుంటే, అది రాజకీయ కక్ష సాధింపుగా మారుతుందన్న ఆందోళన రేవంత్ రెడ్డిలో ఉంది. అటువంటి పరిస్థితుల్లో ప్రజల్లో విపక్ష పార్టీపై సానుభూతి పెరిగే ప్రమాదం ఉందని ఆయన భావిస్తున్నారు. అందుకే ఈ బాధ్యతను కేంద్రానికి అప్పగించడం ద్వారా అటు బీఆర్ఎస్‌ను, ఇటు బీజేపీని ఒకే దెబ్బకు దెబ్బతీయాలని చూస్తున్నారు. వేల కోట్ల ప్రజాధనం వృథా అయినప్పుడు కేంద్రం ఎందుకు మౌనంగా ఉందనే ప్రశ్నను లేవనెత్తడం ద్వారా బీజేపీకి గట్టి సవాల్ విసిరారు. ఒకవేళ విచారణకు ఆదేశిస్తే అక్రమాలు బయటపడతాయి, లేకపోతే రెండు పార్టీల మధ్య రహస్య ఒప్పందం ఉందని ప్రచారం చేయవచ్చు. తెలంగాణ బీజేపీ నేతలకు ఈ పరిణామం మింగుడుపడని విషయంగా మారింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని తాము ఏళ్ల తరబడి ఆరోపిస్తున్నప్పటికీ, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ కోరడంతో క్రెడిట్ అంతా వారి ఖాతాలోకి వెళ్తుందేమోనన్న భయం వారిని వెంటాడుతోంది. అదే సమయంలో సీబీఐ విచారణకు కేంద్రం విముఖత చూపితే, రాష్ట్రంలో బీజేపీకి పెద్ద దెబ్బ తగిలే అవకాశం ఉంది. మోదీ సర్కార్ కేసీఆర్‌ను కాపాడుతోందని ప్రజలు భావించే ప్రమాదం ఉందని కమలనాథులు ఆందోళన చెందుతున్నారు. అటు అమిత్ షా వంటి అగ్రనేతలు ఈ విషయంలో ఇంకా స్పష్టమైన సంకేతాలు ఇవ్వకపోవడంతో రాష్ట్ర బీజేపీ శ్రేణులు అయోమయంలో పడ్డాయి. రేవంత్ రెడ్డి వేస్తున్న ఈ ఎత్తుగడలు సఫలమైతే తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులు సంభవించే అవకాశం ఉంది. సీబీఐ రంగంలోకి దిగి ప్రాజెక్టు ఒప్పందాలు, రీడిజైనింగ్, నిధుల విడుదల వంటి అంశాలపై ఆరా తీస్తే గత ప్రభుత్వ పెద్దలకు ఇబ్బందులు తప్పవు. ముఖ్యంగా బహుళార్థసాధక ప్రాజెక్టు పేరుతో జరిగిన వ్యయంపై కేంద్ర సంస్థ విచారణ చేపడితే అది దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అవుతుంది. ఈ లోపు రాష్ట్రంలో విజిలెన్స్ విచారణను మరింత వేగవంతం చేసి, కీలక అధికారులను విచారించడం ద్వారా మరిన్ని సాక్ష్యాలను బయటకు తీయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఈ వ్యూహం పక్కాగా అమలుకావాలని రేవంత్ రెడ్డి తన టీమ్‌ను ఇప్పటికే అప్రమత్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఈ ప్రాజెక్టుపై సమగ్ర విచారణ జరగడం అత్యవసరమని మేధావులు సైతం అభిప్రాయపడుతున్నారు. వేల కోట్లు ఖర్చు చేసినా పంట పొలాలకు నీరు అందకపోవడం, మేడిగడ్డ వంటి బ్యారేజీలు కుంగిపోవడం వంటి సంఘటనలు ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని నింపాయి. ఈ క్రమంలో రేవంత్ రెడ్డి సీబీఐ విచారణ అనే అస్త్రాన్ని ప్రయోగించడం వల్ల అటు బీఆర్ఎస్ శ్రేణులు ఆత్మరక్షణలో పడ్డాయి. ఆ పార్టీ నేతలు ఈ ఆరోపణలను తిప్పికొడుతున్నప్పటికీ, సాంకేతిక అంశాలపై విచారణ జరిగితే తలెత్తే పరిణామాలను వారు జాగ్రత్తగా గమనిస్తున్నారు. న్యాయ పోరాటం ద్వారా దీన్ని అడ్డుకోవాలా లేక రాజకీయంగానే ఎదుర్కోవాలా అన్నది ఆ పార్టీలో చర్చనీయాంశమైంది. రాజకీయ ఎత్తుగడలు ఎలా ఉన్నప్పటికీ, అంతిమంగా ప్రజలకు జవాబుదారీతనం ఉండాలన్నదే ప్రభుత్వ వాదనగా వినిపిస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన రుణాలపై రాష్ట్ర ఖజానాపై పడుతున్న భారాన్ని రేవంత్ రెడ్డి పదేపదే ప్రస్తావిస్తున్నారు. ఒకవైపు అప్పులు కడుతూనే, మరోవైపు కుంగిన ప్రాజెక్టులను పునరుద్ధరించడం కత్తిమీద సాములా మారింది. ఈ నేపథ్యంలో సీబీఐ విచారణ ద్వారా దోషులను తేల్చడంతో పాటు, ప్రాజెక్టులో జరిగిన ఆర్థిక అక్రమాలను నిరూపించగలిగితే అది రాజకీయంగా కాంగ్రెస్‌కు పెద్ద విజయమే అవుతుంది. అందుకే ఈ అంశంపై రేవంత్ రెడ్డి అస్సలు వెనక్కి తగ్గకూడదని నిర్ణయించుకున్నారు. ఢిల్లీ స్థాయిలో జరుగుతున్న పరిణామాలను గమనిస్తే, కేంద్ర ప్రభుత్వం కూడా తర్జనభర్జన పడుతున్నట్లు సమాచారం. ఒకవైపు రాష్ట్రంలో కాంగ్రెస్ బలం పెరగకుండా చూడటం, మరోవైపు అవినీతిపై పోరాటం చేస్తున్నామన్న ముద్రను కాపాడుకోవడం బీజేపీకి సవాల్‌గా మారింది. ఒకవేళ సీబీఐ విచారణకు ఆదేశిస్తే, దర్యాప్తు సంస్థల దుర్వినియోగం అన్న ఆరోపణలు బీఆర్ఎస్ నుంచి వస్తాయి. అదే సమయంలో విచారణ జరపకపోతే కాంగ్రెస్ పార్టీకి అస్త్రం ఇచ్చినట్లవుతుంది. ఈ సంక్లిష్ట పరిస్థితుల్లో కేంద్రం తీసుకునే నిర్ణయం తెలంగాణ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించబోతోంది. అమిత్ షా గ్రీన్ సిగ్నల్ ఇస్తే మాత్రం సీబీఐ అధికారులు అతి త్వరలోనే హైదరాబాద్‌లో అడుగుపెట్టే అవకాశం ఉంది. రేవంత్ రెడ్డి ఈ విషయంలో చాలా లోతైన అధ్యయనం చేసినట్లు కనిపిస్తోంది. పాత ఫైళ్లను వెలికితీయడం, నిపుణుల సలహాలు తీసుకోవడం ద్వారా పక్కా ఆధారాలతో ఢిల్లీ వెళ్తున్నారు. కేవలం రాజకీయ ప్రసంగాలకే పరిమితం కాకుండా, గణాంకాలతో సహా అక్రమాలను నిరూపించేందుకు ఆయన సిద్ధమయ్యారు.



# తెలంగాణ కొత్త డీజీపీగా సీవీ ఆనంద్

**మొదటిపేజీ తరువాయి**

అంజనీకుమార్, రవిగుప్తా, జితేందర్ వంటి అధికారులు ఇంచార్జ్ డీజీపీలుగానే బాధ్యతలు నిర్వహించారు. దీనివల్ల దీర్ఘకాలిక ప్రణాళికల అమలులో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇప్పుడు సీవీ ఆనంద్ నియామకంతో తెలంగాణకు మూడో పూర్తిస్థాయి డీజీపీ లభించినట్లయింది. గతంలో అనురాగ్ శర్మ, మహేందర్ రెడ్డి మాత్రమే యూపీఎస్సీ నిబంధనల ప్రకారం పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర తొలి డీజీపీగా పనిచేసిన అనురాగ్ శర్మ మొదట తాత్కాలికంగా బాధ్యతలు చేపట్టినప్పటికీ, ఆ తర్వాత 2015 నవంబర్ 13న యూపీఎస్సీ ద్వారా పూర్తిస్థాయి డీజీపీగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన 2017 వరకు ఆ పదవిలో కొనసాగారు. ఆ తర్వాత మహేందర్ రెడ్డి కూడా ఇదే పద్ధతిలో నియామకమై 2022 డిసెంబర్ వరకు సేవలందించారు. వీరిద్దరి తర్వాత మళ్ళీ ఇప్పుడు సీవీ ఆనంద్ రూపంలో రాష్ట్రానికి పూర్తిస్థాయి పోలీస్ బాస్ లభించారు. ఈ నియామకం వల్ల పోలీస్ వ్యవస్థలో క్రమశిక్షణతో పాటు జవాబుదారీతనం మరింత పెరుగుతుందని ప్రభుత్వం ఆశిస్తోంది. మరోవైపు హోం శాఖలో కూడా కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. సీవీ ఆనంద్ డీజీపీగా వెళ్తుండటంతో ఆయన స్థానంలో సీనియర్ ఐపీఎస్ అధికారిణి శిఖా గోయల్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. శిఖా గోయల్ ప్రస్తుతం అదనపు డీజీపీ హోదాలో ఉంటూనే హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కొత్త బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మార్పులు మే 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. పరిపాలనా సౌలభ్యం కోసం ప్రభుత్వం ఈ బదిలీలను అత్యంత వ్యూహాత్మకంగా చేపట్టినట్లు సచివాలయ వర్గాలు పేర్కొంటున్నాయి. శిఖా గోయల్‌కు హోం శాఖ బాధ్యతలతో పాటు సైబర్ సెక్యూరిటీ బ్యూరో, ఫోరెన్సిక్ ల్యాబ్ అదనపు బాధ్యతలను కూడా ప్రభుత్వం అప్పగించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఆమె అనుభవం ఈ విభాగాలకు ఎంతగానో ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ఫోరెన్సిక్ విభాగం ఆధునీకరణలో కూడా ఆమె గతంలో కీలక పాత్ర పోషించారు. ఇప్పుడు ప్రధాన శాఖ బాధ్యతలతో పాటు ఈ సాంకేతిక విభాగాలను పర్యవేక్షించడం సవాలుతో కూడుకున్నప్పటికీ, ఆమె సమర్థవంతంగా నిర్వహిస్తారని పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది. రాష్ట్ర డీజీపీ పదవి కోసం గత కొంతకాలంగా తెరవెనుక భారీ కసరత్తు జరిగినట్లు సమాచారం. ముఖ్యంగా సీవీ ఆనంద్, శిఖా గోయల్ మధ్య గట్టి పోటీ నెలకొందని ప్రచారం జరిగింది. గతంలో డీజీపీ జితేందర్ పదవీ విరమణ సమయంలోనే శిఖా గోయల్ ఈ అత్యున్నత పదవిని దక్కించుకోవడానికి తీవ్రంగా ప్రయత్నించారు. అయితే ఆ సమయంలో సీనియారిటీ, ఇతర సమీకరణాల దృష్ట్యా ప్రభుత్వం అప్పట్లో శివధర్ రెడ్డికి అవకాశం కల్పించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు శివధర్ రెడ్డికి ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించడంతో అప్పట్లో ఆ పోటీ సద్దుమణిగింది. ప్రస్తుత డీజీపీ పదవీ కాలం ముగుస్తున్న తరుణంలో మళ్లీ శిఖా గోయల్ పేరు ప్రముఖంగా వినిపించింది. రాష్ట్ర చరిత్రలో తొలి మహిళా డీజీపీగా గుర్తింపు పొందాలని ఆమె ఆశించినట్లు పోలీస్ వర్గాల్లో జోరుగా చర్చ సాగింది. ఇందుకోసం ఆమె అన్ని స్థాయిల్లో ప్రయత్నాలు చేసినప్పటికీ, చివరి నిమిషంలో సమీకరణాలు మారాయి. ప్రభుత్వం అనుభవం, క్షేత్రస్థాయి పనితీరును పరిగణనలోకి తీసుకుని సీవీ ఆనంద్ వైపు మొగ్గు చూపింది. దీంతో ఆమెకు మరోసారి నిరాశే ఎదురైందని, ఆమె డీజీపీ కల ప్రస్తుతానికి కలగానే మిగిలిపోయిందని అంతా చర్చించుకుంటున్నారు. సీవీ ఆనంద్ నియామకం వెనుక ఆయన గతంలో నిర్వహించిన కీలక బాధ్యతలు ప్రధాన కారణమని చెప్పవచ్చు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా పని చేసిన సమయంలో ఆయన శాంతిభద్రతల పరిరక్షణలో చూపిన చొరవ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో తెచ్చిన సంస్కరణలు అందరి ప్రశంసలు అందుకున్నాయి. క్లిష్ట సమయాల్లో సంయమనంతో వ్యవహరిస్తూనే నేరస్తుల పట్ల కఠినంగా ఉండటం ఆయన శైలి. ఈ లక్షణాలే ఆయనను డీజీపీ రేసులో ముందు నిలబెట్టాయి. ప్రభుత్వం కూడా రాబోయే రెండేళ్ల కాలంలో రాష్ట్రంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండాలని ఆయనపై నమ్మకం ఉంచింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పోలీస్ శాఖలో అనేక మార్పులు వచ్చాయి. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడంలో రాష్ట్ర పోలీస్ దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. ఇప్పుడు సీవీ ఆనంద్ సారథ్యంలో ఈ విభాగం మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాల్సిన అవసరం ఉంది. మత్తు పదార్థాల నియంత్రణ, మహిళల భద్రత, పెరుగుతున్న సైబర్ నేరాల అదుపు వంటివి నూతన డీజీపీ ముందున్న ప్రధాన సవాళ్లు. వీటిని ఎదుర్కోవడంలో ఆయన తనదైన ముద్ర వేస్తారని కింది స్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారుల వరకు అందరూ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.




# జగద్గిరిగుట్టలో బైక్ దొంగకు పోలీసుల షాక్

- వెల్డింగ్ పనుల ముసుగులో మూడు బైక్‌లు మాయం
- దీనబంధు కాలనీ కుర్రాడి దొంగాట కట్టించిన ఖాకీలు
- 24 గంటల్లోనే చిక్కిన పాత నేరస్థుడు

**సైబరాబాద్, విశాలభారతి:**

పగలు వెల్డింగ్ పనులు.. రాత్రయితే బైక్ చోరీలు. ఇదీ దీనబంధు కాలనీకి చెందిన 22 ఏళ్ల కుర్రాడి డబుల్ గేమ్. కానీ ఖాకీల దెబ్బకు చివరకు జైలు ఊచలు లెక్కపెట్టక తప్పలేదు. జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో గత వారం రోజులుగా కలకలం రేపుతున్న బైక్ చోరీల వెనుక పాత నేరస్థుడు సారోలు వెంకటేష్(22) హస్తం ఉందని పోలీసులు గుర్తించారు. మంగళవారం విశ్వసనీయ సమాచారంతో వలపన్ని వెల్డింగ్ షాప్ వద్దే మెరుపు దాడి చేసి పట్టుకున్నారు. నిందితుడి నుంచి సుమారు రూ.2.5 లక్షల విలువైన హోండా షైన్, హీరో గ్లామర్, పల్సర్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.




స్వాధీనం చేసుకున్న మూడు బైక్‌లతో నిందితుడు. చిత్రంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ నరేంద్ర రెడ్డి, పోలీసు సిబ్బంది

**దొంగబుద్ధి ఎలా?**

రాత్రి 11 దాటితే చాలు.. వెల్డింగ్ పనిముట్లు పక్కనపెట్టి దొంగ అవతారమెత్తేవాడు. అపార్ట్‌మెంట్లు, ఇళ్ల ముందు, వైన్ షాపుల వద్ద నిలిపిన బైక్‌లను టార్గెట్ చేసేవాడు. హ్యాండిల్ లాక్‌ను క్షణాల్లో విరగ్గొట్టి, తీగతో డైరెక్ట్ చేసి బైక్‌ను మాయం చేసేవాడు. దొంగిలించిన బైక్‌లకు నకిలీ నంబర్లు వేసి, శివారు ప్రాంతాల్లో తక్కువ ధరకు అమ్మేసేవాడని విచారణలో వెంకటేష్ నేరం అంగీకరించాడు.

**పాత చరిత్రే.. కొత్త రూటు**

ఇతగాడు మామూలోడు కాదు. గతంలో మాదాపూర్, గచ్చిబౌలి, జీడిమెట్ల, కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్లలో బైక్ చోరీ కేసుల్లో జైలుకు వెళ్లొచ్చాడు. జైలు నుంచి బయటకు రాగానే వెల్డింగ్ పనులు చేస్తూ బుద్ధి మార్చుకున్నట్లు నటించాడు. కానీ దొంగబుద్ధి మానక మళ్లీ పాత పంథాలోనే చోరీలకు తెగబడ్డాడు.

**పోలీసుల మెరుపు దాడి**

జగద్గిరిగుట్టలో వరుస బైక్ చోరీలపై డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ నరేంద్ర రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారు. సీసీటీవీ ఫుటేజీలు, పాత నేరస్థుల కదలికలపై నిఘా పెట్టి, 24 గంటల్లోనే నిందితుడిని ట్రేస్ చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా, జ్యుడీషియల్ కస్టడీ విధించింది.

**అభినందనల వెల్లువ**

కేసును చాకచక్యంగా ఛేదించిన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ నరేంద్ర రెడ్డిని, క్రైమ్ సిబ్బందిని ఖుత్బుల్లాపూర్ డీసీపీ కోటి రెడ్డి, ఏసీపీ బాలగంగి రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. "బైక్ యజమానులు హ్యాండిల్ లాక్‌తో పాటు వీల్ లాక్ కూడా వేసుకోవాలి. సీసీటీవీ పరిధిలోనే వాహనాలు పార్క్ చేయాలి" అని డీసీపీ సూచించారు.

# బెంగాల్‌లో రెండో విడత పోలింగ్

మొదటిపేజీ తరువాయి

తన ప్రభుత్వం అమలు చేస్తున్న లక్ష్మీ భండార్ వంటి సంక్షేమ పథకాలు నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచాయని, అదే తనను మూడోసారి అధికారంలోకి తెస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేస్తున్నారు. మహిళా ఓటర్ల మద్దతు తనకే ఉంటుందని నమ్ముతున్న దీదీ, ఒంటిచేత్తో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. ఈ రెండో విడత ఎన్నికల్లో అన్ని కళ్లూ నందిగ్రామ్ నియోజకవర్గం పైనే ఉన్నాయి. ఒకప్పుడు మమతా బెనర్జీకి అత్యంత ఆప్తుడిగా ఉండి, ఇప్పుడు బీజేపీలో కీలక నేతగా ఎదిగిన సువేందు అధికారి మధ్య జరుగుతున్న పోరు కేవలం ఒక స్థానానికే పరిమితం కాలేదు. ఇది అటు పాలకులకు, ఇటు ప్రతిపక్షాలకు ఆత్మగౌరవ పోరాటంగా మారింది. అలాగే సిలిగురి వంటి పట్టణ ప్రాంతాల్లో కూడా ఆధిపత్యం కోసం తీవ్రమైన పోటీ నెలకొంది. అక్కడ మేయర్ గౌతమ్ దేబ్, శంకర్ ఘోష్‌ల మధ్య జరుగుతున్న పోరు ఉత్తర బెంగాల్ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేలా కనిపిస్తోంది. పాత కోటలను కాపాడుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ కూడా తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. బహరంపూర్‌లో కాంగ్రెస్ సీనియర్ నేత అధీర్ రంజన్ చౌదరి తన రాజకీయ అస్తిత్వం కోసం పోరాడుతున్నారు. దశాబ్దాలుగా తన పట్టున్న ఈ ప్రాంతంలో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఆయన శ్రమిస్తున్నారు. మరోవైపు కృష్ణగంజ్ వంటి స్థానాల్లో సుకాంత బిస్వాస్ వంటి నేతల రాజకీయ భవితవ్యం కూడా బుధవారం నాటి పోలింగ్‌తోనే తేలనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యావంతులు, యువత ఈసారి ఎటువైపు మొగ్గు చూపుతారనేది అత్యంత కీలకంగా మారింది. ఈ ఎన్నికల పోరులో సామాజిక సమీకరణలు కూడా కీలక పాత్ర పోషిస్తున్నాయి. ముఖ్యంగా మతువా సామాజిక వర్గం ఓటర్లను ఆకర్షించేందుకు బీజేపీ పౌరసత్వ సవరణ చట్టం అంశాన్ని ప్రధాన అస్త్రంగా వాడుకుంది. మతువాల ప్రాబల్యం ఉన్న నదియా, ఉత్తర 24 పరగణాలు జిల్లాల్లో బీజేపీ క్షేత్రస్థాయిలో బలపడాలని చూస్తోంది. దీనికి విరుద్ధంగా, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ ఓట్ల ధ్రువీకరణ ద్వారా బీజేపీకి చెక్ పెట్టాలని భావిస్తోంది. గతంలో తమకు అండగా ఉన్న మైనారిటీలు ఈసారి కూడా తమకే ఓటు వేస్తారని టీఎంసీ గట్టి నమ్మకంతో ఉంది. కోల్‌కతా పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ వ్యతిరేకత ఏ స్థాయిలో ఉందనేది ఫలితాలను తీవ్రంగా ప్రభావితం చేయనుంది. ఉద్యోగాల కల్పన, విద్యా రంగంలో సంస్కరణలు వంటి అంశాలను యువత ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంటున్నారు. నగరాల్లోని మధ్యతరగతి ఓటర్లు శాంతిభద్రతల అంశాన్ని ప్రాధాన్యతగా భావిస్తున్నారు. గత పదేళ్లలో జరిగిన అభివృద్ధి కంటే మౌలిక వసతుల కల్పనలో ఉన్న లోపాలను బీజేపీ ఎండగడుతుండగా, కేంద్రం నుంచి సహకారం అందడం లేదని టీఎంసీ ఎదురు దాడి చేస్తోంది. ఈ వాదోపవాదాల మధ్య సామాన్య ఓటరు ఎవరి వైపు నిలుస్తారనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. బెంగాల్ ఎన్నికల చరిత్రలో హింసాత్మక ఘటనలు సర్వసాధారణంగా మారిన నేపథ్యంలో, ఎన్నికల సంఘం ఈసారి అత్యంత



కఠినమైన భద్రతా చర్యలు చేపట్టింది. తొలి దశలో చెదురుమొదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో, రెండో దశలోనూ అదే పరిస్థితి ఉండాలని అధికారులు భావిస్తున్నారు. సుమారు లక్షకు పైగా కేంద్ర బలగాలను పోలింగ్ కేంద్రాల వద్ద మోహరించారు. సున్నితమైన ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా నిఘా ఉంచడంతో పాటు, ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వీడియో గ్రాఫర్లను ఏర్పాటు చేశారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా భరోసా కల్పిస్తున్నారు. ఈ రెండో విడతలో పోటీ పడుతున్న 1,448 మంది అభ్యర్థుల భవితవ్యం రేపు ఈవీఎంలలో నిక్షిప్తం కానుంది. మమతా బెనర్జీ స్వయంగా పోటీ చేస్తున్న భవానీపూర్ నియోజకవర్గంలో కూడా బుధవారమే పోలింగ్ జరుగుతుండటంతో రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. అక్కడి ఓటర్లు తమ ముఖ్యమంత్రికి మళ్ళీ పట్టం కడతారా లేక మార్పును కోరుకుంటారా అనేది ఆసక్తికరంగా మారింది. ప్రచార పర్వంలో నాయకుల మధ్య జరిగిన మాటల యుద్ధం, పరస్పర ఆరోపణలు ఓటర్ల మనసులను ఎంతవరకు ప్రభావితం చేశాయో మరికొద్ది రోజుల్లో తేలిపోనుంది.

# జీహెచ్‌ఎంసీలో భారీ స్కామ్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

విశ్వనగరంగా విరాజిల్లుతున్న హైదరాబాద్ మహా నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్లలో పారిశుధ్య విభాగం అవినీతికి నిలయంగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విధులకు ముఖం చాటేస్తూనే వేలాది రూపాయల జీతాలు పొందుతున్న వైనం మున్సిపల్ వర్గాల్లో కలకలం రేపుతోంది. క్షేత్రస్థాయిలో చెత్త కుప్పలు పేరుకుపోతున్నా పర్యవేక్షించాల్సిన యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం. అధికారులు ఎన్ని ఆంక్షలు విధిస్తున్నా అక్రమార్కులు సాంకేతికతను తమకు అనుకూలంగా మార్చుకుంటూ ప్రభుత్వ ఖజానాను లూటీ చేస్తున్నారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో ఉండాల్సిన కొందరు అధికారులు కింది స్థాయి సిబ్బందితో చేతులు కలపడం వల్ల సామాన్య ప్రజలకు నగర జీవనం నరకప్రాయంగా మారుతోంది. గతంలో బయోమెట్రిక్ విధానం అమలులో ఉన్నప్పుడు సిబ్బంది మైనం వేలిముద్రలను సృష్టించి మోసాలకు పాల్పడేవారు. ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేసే ఉద్దేశంతో ప్రభుత్వం అత్యంత ఆధునికమైన ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టింది. అయితే ఈ సాంకేతికతను సైతం అక్రమార్కులు తమ స్వార్థం కోసం వాడుకుంటున్నారు. కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్లలో ప్రస్తుతం 998 మంది కార్మికులు ఈ విధానంలో నమోదై ఉన్నారు. రికార్డుల ప్రకారం వీరంతా విధుల్లో ఉన్నట్లు కనిపిస్తున్నా వాస్తవానికి సుమారు 89 మంది కార్మికులు గత కొన్ని నెలలుగా అసలు విధులకు హాజరు కావడం లేదని క్షేత్రస్థాయి నివేదికలు చెబుతున్నాయి. ఫోన్లలో ముందే సేకరించిన ఫోటోల ద్వారా లేదా ఎస్ఎఫ్ఏల సహకారంతో నకిలీ హాజరు వేయించుకుంటూ నెలానెలా జీతాలు స్వాహా చేస్తున్నారు. మూసాపేట సర్కిల్‌లో కొత్తగా విధుల్లో చేరిన సిబ్బంది వ్యవహారం మరీ దారుణంగా తయారైంది. ఇటీవల విధుల్లోకి తీసుకున్న సుమారు 40 మంది కార్మికుల నుంచి భారీగా ముడుపులు వసూలు చేసినట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కొక్కరి వద్ద నుంచి రూ. 50 వేల నుంచి రూ. 2 లక్షల వరకు వసూలు చేసి విధుల్లో చేర్చుకున్నారనే వార్త కార్పొరేషన్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ భారీ వసూళ్లు కింది స్థాయి సిబ్బంది నుంచి పైస్థాయి అధికారుల వరకు అందుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.



ఇంత మొత్తంలో డబ్బు చెల్లించి విధుల్లో చేరిన వారు తాము పని చేయకపోయినా ఎవరూ ఏమీ అనరనే ధీమాతో విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నారు. దీనివల్ల నిబద్ధతతో పనిచేసే ఇతర కార్మికులపై పని భారం పెరుగుతోంది. మున్సిపల్ పరిపాలనలో పారదర్శకత కోసం ప్రవేశపెట్టిన ఎఫ్ఆర్ఎస్ విధానం ఇక్కడ అభాసుపాలవుతోంది. కార్మికులు విధులకు రాకపోయినా ఎస్ఎఫ్ఏలు వారి ఫోన్లను తామే దగ్గర ఉంచుకుని హాజరు వేస్తున్నట్లు విచారణలో తేలింది. ఒక్కో కార్మికుడి నుంచి హాజరు వేసినందుకు గాను నెలకు నిర్ణీత మొత్తాన్ని కమీషన్ రూపంలో వసూలు చేస్తున్నారు. ఈ పద్ధతి వల్ల కార్పొరేషన్‌కు ప్రతి నెలా సుమారు రూ. 15 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు ఆర్థిక నష్టం వాటిల్లుతోంది. విధులకు హాజరుకాని వారిపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కలిగిన పారిశుధ్య పర్యవేక్షకులు సైతం ఈ అక్రమాల్లో వాటాలు పొందుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సామాన్య పన్ను చెల్లింపుదారుల సొమ్ము ఇలా దుర్వినియోగం కావడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య నిర్వహణ పడకేయడంతో కూకట్‌పల్లి, మూసాపేట ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. ప్రధాన రహదారుల పక్కన, నివాసాల మధ్య చెత్త కుప్పలు రోజుల తరబడి పేరుకుపోతున్నాయి. కార్మికుల కొరత లేదని రికార్డులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పని చేసే వారు కనిపించడం లేదు. మురికి కాల్వల పూడికతీత పనులు కూడా నామమాత్రంగానే జరుగుతున్నాయి. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో ఈ అక్రమాలు ఇలాగే కొనసాగితే నగర వాసులకు ఇబ్బందులు తప్పవు. అధికారులు తనిఖీలకు వస్తున్నారనే సమాచారం అందినప్పుడు మాత్రమే సిబ్బంది హడావుడి చేస్తున్నారే తప్ప మిగిలిన సమయాల్లో కార్యాలయాల వద్ద కాలక్షేపం చేస్తున్నారు. ఈ అక్రమ దందాలో బడా నేతల హస్తం కూడా ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో ఉన్న పారిశుధ్య కార్మికుల హాజరును పరిశీలిస్తే విస్తుపోయే వాస్తవాలు బయటపడుతున్నాయి. కొందరు కార్మికులు ఇతర ప్రైవేట్ పనులు చేసుకుంటూ ఇక్కడ మాత్రం హాజరు వేయించుకుంటున్నారు. వీరి వెనుక ఉన్న బలమైన రాజకీయ శక్తుల కారణంగా అధికారులు సైతం గట్టిగా నిలదీయలేకపోతున్నారు. ఎఫ్ఆర్ఎస్ విధానంలో ఉన్న లోపాలను సరిదిద్దకపోతే భవిష్యత్తులో ఈ దోపిడీ మరింత పెరిగే అవకాశం ఉంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని కేవలం హాజరు కోసమే కాకుండా కార్మికుల పనితీరును జీపీఎస్ ద్వారా పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని నగర వాసులు కోరుతున్నారు. పారిశుధ్య కార్మికుల సంఖ్యకు, జరుగుతున్న పనికి ఎక్కడా పొంతన లేకపోవడం గమనార్హం. ఈ అక్రమాలపై ఫిర్యాదులు అందుతున్నాయని కూకట్‌పల్లి సర్కిల్ డీసీ రమేష్ పేర్కొన్నారు. విధులకు హాజరుకాని సిబ్బందిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మూసాపేట సర్కిల్ పర్యవేక్షకుడు నిరంజన్ రావు కూడా క్షేత్రస్థాయి తనిఖీలను ముమ్మరం చేస్తామని స్పష్టం చేశారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే ఎస్ఎఫ్ఏలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటికే నిరంతర హాజరు లేని కొందరికి నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. అధికారులు పర్యవేక్షణ పెంచితే తప్ప ఈ వ్యవస్థలో మార్పు రాదని ప్రజలు భావిస్తున్నారు. మున్సిపల్ కార్యాలయాల్లో తిష్టవేసిన అవినీతి తిమింగలాలను ఏరివేయాల్సిన సమయం ఆసన్నమైంది. అక్రమ వసూళ్ల పర్వం మూసాపేటలో తారాస్థాయికి చేరింది. కొత్తగా చేరిన కార్మికులు తమ ఉద్యోగ భద్రత కోసం లక్షలాది రూపాయలు అప్పులు చేసి అధికారులకు సమర్పించుకున్నట్లు తెలుస్తోంది. ఈ సొమ్మును తిరిగి వసూలు చేసుకోవడం కోసం వారు విధులకు హాజరుకాకుండా ప్రైవేట్ పనులకు వెళ్తున్నారు. పారిశుధ్య విభాగంలో జరుగుతున్న ఈ గోల్‌మాల్‌పై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని పలువురు సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. కేవలం కింది స్థాయి సిబ్బందిని బలిపశువులను చేయకుండా దీని వెనుక ఉన్న సూత్రధారులను పట్టుకోవాలని కోరుతున్నారు. విజిలెన్స్ విచారణ చేపడితే మరిన్ని షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. కార్పొరేషన్ ఖజానాకు కన్నం వేస్తున్న అక్రమార్కుల ఆటలు కట్టించాలని ప్రజలు కోరుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తన ప్రతిష్టను కాపాడుకోవాలంటే తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టాలి. ఎఫ్ఆర్ఎస్ వ్యవస్థలో లొసుగులు లేకుండా చూడటానికి ఐటీ విభాగాన్ని అప్రమత్తం చేయాలి. నకిలీ హాజరును గుర్తించడానికి ఆకస్మిక తనిఖీలు నిర్వహించేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం అవసరం. పారిశుధ్య నిర్వహణపై ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించేలా మొబైల్ యాప్‌లను బలోపేతం చేయాలి. పని చేయని కార్మికుల వల్ల సంస్థకు చెడ్డపేరు వస్తోందని నిజాయితీగా పనిచేసే సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. పారదర్శకత అనేది కేవలం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలు కావాలి. అప్పుడే భాగ్యనగరం పరిశుభ్రంగా మారుతుంది.

మున్సిపల్ చట్టం ప్రకారం విధులకు హాజరుకాకుండా ప్రభుత్వ ధనాన్ని పొందే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. ఈ నిబంధనను కఠినంగా అమలు చేస్తే తప్ప అక్రమార్కుల్లో భయం కలగదు. కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్లలో జరిగిన ఈ కుంభకోణం కేవలం మచ్చుతునక మాత్రమే అని నగరం మొత్తం ఇలాంటి పరిస్థితులే ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పారిశుధ్య కార్మికుల హక్కులను కాపాడుతూనే బాధ్యతలను గుర్తు చేయాల్సిన అవసరం ఉంది. రాజకీయ జోక్యం తగ్గితేనే అధికారులకు స్వేచ్ఛగా పనిచేసే అవకాశం లభిస్తుంది. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిని వెంటనే విధుల్లో నుంచి తొలగించాలని స్థానిక నివాసితులు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్ పాలనలో సమూల మార్పులు రావాలని ఆకాంక్షిస్తున్నారు.

# ఫ్యూచర్ సిటీ భవిష్యత్ తరాలకు వరం

మొదటిపేజీ తరువాయి

సమయంలోగా పనులను పూర్తి చేయాలన్నదే తమ సంకల్పమని ఆయన ఈ సభా వేదికగా అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయని, శంషాబాద్ విమానాశ్రయం నుంచి ముంబై వరకు పూణే మీదుగా బుల్లెట్ ట్రైన్ రాబోతోందని ముఖ్యమంత్రి ఒక కీలక ప్రకటన చేశారు. దీంతో పాటు శంషాబాద్ ప్రాంతంలో దేశంలోనే అతి పెద్ద బస్ టెర్మినల్‌ను కూడా నిర్మిస్తామని ఆయన వెల్లడించారు. గత ప్రభుత్వం ప్రతిపాదించిన కాలుష్య కారకమైన ఫార్మాసిటీని తాము తీవ్రంగా వ్యతిరేకించామని, పర్యావరణానికి హాని కలగకుండా ఉండేందుకే తాము ఫ్యూచర్ సిటీ ఆలోచనను తీసుకువచ్చామని చెప్పారు. ప్రకృతిని కాపాడుతూనే పారిశ్రామికంగా ఎదగడం తమ ప్రభుత్వ విధానమని ఆయన స్పష్టంగా వివరించారు. అభివృద్ధి పనులను చూసి ఓర్వలేని వారు విమర్శలు చేస్తూనే ఉంటారని, తాము మాత్రం ఫ్యూచర్ సిటీ లక్ష్యం కోసమే నిరంతరం పనిచేస్తామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ కుటుంబం తనపై చేస్తున్న విమర్శలను ఆయన ఎద్దేవా చేశారు. అధికారం కోల్పోయిన బాధలో వారు ఉన్నారని, వారు ఎంత ఏడుస్తుంటే తనకు అంత వినసొంపుగా ఉంటుందని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఫ్యూచర్ సిటీ కడతామంటే వారు సహకరించాల్సింది పోయి అడ్డంకులు సృష్టిస్తున్నారని, ప్రతిపక్షం తీరు అభివృద్ధి నిరోధకంగా ఉందని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాజకీయ ప్రత్యర్థులపై విమర్శనాస్త్రాలు సంధిస్తూ ముఖ్యమంత్రి పలు పురాణ పాత్రలను ఉదహరించారు. శుక్రాచార్యుడు ఫామ్ హౌస్‌లో విశ్రాంతి తీసుకుంటుంటే, మారీచుడు, సుభాహుడు జనం మధ్య తిరుగుతూ విష ప్రచారం చేస్తున్నారని పరోక్షంగా హరీశ్ రావు, కేటీఆర్ లపై విమర్శలు గుప్పించారు. అధికారం కోల్పోయినప్పటి నుంచి వారు ఏదో ఒక విధంగా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, కానీ ప్రజలు అన్ని గమనిస్తున్నారని ఆయన హెచ్చరించారు. ఫామ్ హౌస్ రాజకీయాలకు స్వస్తి చెప్పి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన హితవు పలికారు. తెలంగాణను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఫ్యూచర్ సిటీ ఒక చోదక శక్తిగా మారుతుందని రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే కాలంలో ఇక్కడ వేల సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, యువతకు ఉపాధి కల్పించడమే తమ ప్రాధాన్యత అని చెప్పారు. కేవలం ఐటీ రంగమే కాకుండా విద్య, వైద్యం, క్రీడా రంగాలకు కూడా ఈ నగరంలో పెద్దపీట వేస్తామని ఆయన హామీ ఇచ్చారు. నగరానికి సంబంధించి ప్రతి అడుగు పక్కా ప్రణాళికతో వేస్తున్నామని, భవన నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడబోమని ఆయన స్పష్టం చేశారు. ఈ భూమిపూజ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు పాల్గొని ఫ్యూచర్ సిటీ ప్రాధాన్యతను వివరించారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ సాంకేతికత రంగంలో తెలంగాణను అగ్రగామిగా నిలపడానికి ముఖ్యమంత్రి పడుతున్న తపన అభినందనీయమని కొనియాడారు. జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ దక్షిణ తెలంగాణ అభివృద్ధికి ఈ నగరం ఒక కిలక మలుపు అని అభివర్ణించారు. శాసన మండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్ తదితరులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని తమ మద్దతు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తన నియోజకవర్గంలో ఇంతటి భారీ ప్రాజెక్టును చేపట్టినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాంత రైతులు, ప్రజలు అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకరిస్తారని ఆయన హామీ ఇచ్చారు. పోలీస్ కమిషనరేట్ భవన నిర్మాణం వల్ల ఈ ప్రాంతంలో భద్రత మరింత మెరుగుపడుతుందని, తద్వారా పెట్టుబడులు వచ్చేందుకు మార్గం సుగమం అవుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. డీజీపీ శివధర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని భవన నిర్మాణ నమూనాలను ముఖ్యమంత్రికి వివరించారు.



# నేడే టెన్త్ ఫలితాలు

మొదటిపేజీ తరువాయి

వెలువడటంతో అటు విద్యార్థుల్లోనూ, ఇటు విద్యా వర్గాల్లోనూ సందడి నెలకొంది. తమ విద్యా భవిష్యత్తును నిర్ణయించే ఈ ఫలితాల కోసం విద్యార్థులు ఆత్రుతగా వేచి చూస్తున్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని సెకండరీ స్కూల్ సర్టిఫికేట్ బోర్డు ప్రధాన కార్యాలయం ఈ కీలక ఘట్టానికి వేదిక కానుంది. విద్యాశాఖకు చెందిన అత్యున్నత స్థాయి ప్రతినిధులు ఈ ఫలితాల విడుదల కార్యక్రమంలో పాల్గొంటారు. ముఖ్యంగా ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావుతో పాటు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా సంయుక్తంగా ఫలితాలను కంప్యూటర్ బటన్ నొక్కి విడుదల చేస్తారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా ఉత్తీర్ణత శాతం ఎంత ఉంది, ఏ జిల్లా అగ్రస్థానంలో నిలిచింది, బాలురు, బాలికల సాధించిన ఫలితాల వివరాలను మీడియా ముఖంగా వారు బహిర్గతం చేయనున్నారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల నిర్వహణ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా సాగింది. మార్చి 14వ తేదీన ప్రారంభమైన ఈ పరీక్షలు ఏప్రిల్ 16వ తేదీ వరకు కొనసాగాయి. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన వందలాది పరీక్షా కేంద్రాల్లో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. సుమారు నెల రోజుల పాటు సాగిన ఈ విద్యా క్రతువులో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకునేందుకు శ్రమించారు. పరీక్షలు ముగిసిన వెంటనే మూల్యాంకన ప్రక్రియను కూడా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడం వల్ల సకాలంలో ఫలితాలు వెల్లడవుతున్నాయి. సంఖ్యాపరంగా చూస్తే ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు హాజరైన వారి సంఖ్య గణనీయంగా ఉంది. మొత్తం 5 లక్షల 28 వేల మంది విద్యార్థులు ఈ పరీక్షల కోసం దరఖాస్తు చేసుకుని హాజరయ్యారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థుల సంఖ్య 5 లక్షల 17 వేల వరకు ఉండగా, గతంలో ఉత్తీర్ణత సాధించలేక ఈ ఏడాది సప్లిమెంటరీ కింద హాజరైన వారు సుమారు పది వేల మంది పైచిలుకు ఉన్నారు. ఇంత పెద్ద సంఖ్యలో విద్యార్థుల భవిష్యత్తు ముడిపడి ఉన్న నేపథ్యంలో, ఫలితాల వెల్లడి సమయంలో ఎటువంటి సాంకేతిక లోపాలు తలెత్తకుండా ఐటీ విభాగం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటోంది. ప్రభుత్వం ఫలితాల వెల్లడి కోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోంది. విద్యార్థులు తమ మార్కుల వివరాలను తెలుసుకోవడానికి పలు అధికారిక వెబ్‌సైట్లను అందుబాటులోకి తెచ్చారు. ఫలితాలు విడుదలైన వెంటనే ఇంటర్నెట్ సర్వర్లపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉన్నందున, ప్రత్యామ్నాయ పోర్టల్‌లను కూడా విద్యాశాఖ సిద్ధం చేసింది. హాల్ టికెట్ నంబర్ నమోదు చేయడం ద్వారా విద్యార్థులు తమ గ్రేడింగ్ మరియు సబ్జెక్టుల వారీగా సాధించిన మార్కులను సులభంగా చూసుకునే వీలు కల్పించారు. దీనివల్ల గతంలో మాదిరిగా ఇంటర్నెట్ సెంటర్ల వద్ద పడిగాపులు కాయాల్సిన అవసరం ఉండదు. ఫలితాల ప్రకటన అనంతరం విద్యార్థుల మానసిక స్థితిని దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ పలు కీలక సూచనలు చేసింది. కేవలం మార్కులు లేదా గ్రేడ్‌ల ఆధారంగానే విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేయకూడదని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేస్తోంది. ఉత్తీర్ణత సాధించిన వారు పై చదువులకు సిద్ధం కావాలని, ఒకవేళ ఆశించిన ఫలితం రాకపోతే నిరాశ చెందకుండా తదుపరి నిర్వహించే అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం కావాలని అధికారులు సూచిస్తున్నారు. విద్యా సంవత్సరం వృథా కాకుండా ఉండేందుకు ప్రభుత్వం సప్లిమెంటరీ పరీక్షలను కూడా త్వరితగతిన నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల వారీగా ఫలితాల విశ్లేషణపై కూడా సర్వత్రా ఆసక్తి నెలకొంది. గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో బాలికలే పైచేయి సాధిస్తున్న నేపథ్యంలో ఈసారి కూడా అదే ట్రెండ్ కొనసాగుతుందా అన్న చర్చ విద్యా వర్గాల్లో సాగుతోంది. అలాగే గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు పట్టణ ప్రాంత విద్యార్థులకు దీటుగా రాణిస్తుండటం గమనార్హం. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు విద్యాశాఖ ఏడాది పొడవునా ప్రత్యేక తరగతులు, స్టడీ మెటీరియల్ పంపిణీ వంటి చర్యలు చేపట్టింది. ఈ కృషి ఫలితాలు నేటి ప్రకటనలో స్పష్టంగా కనిపించే అవకాశం ఉంది. పదో తరగతి ఫలితాల వెల్లడి సమయం దగ్గర పడుతుండటంతో విద్యార్థుల ఇళ్లలో సందడి, కొంత ఆందోళన కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఉన్నత పాఠశాల స్థాయి నుంచి ఇంటర్మీడియట్ లేదా ఇతర వృత్తి విద్యా కోర్సుల్లో చేరడానికి ఈ మార్కులు కీలక ప్రాతిపదికగా నిలుస్తాయి. పాలిటెక్నిక్, ఐఐఐటీ వంటి కోర్సుల్లో ప్రవేశం కోరుకునే వారికి టెన్త్ గ్రేడింగ్ పాయింట్లు ఎంతో కీలకం. అందుకే ప్రతి విద్యార్థి తమ కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కుతుందని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఉపాధ్యాయులు సైతం తమ పాఠశాల ఉత్తీర్ణత శాతం పెరగాలని ఆకాంక్షిస్తున్నారు.



# రాష్ట్రంలో 5 కొత్త ఎయిర్‌పోర్టులు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో గగనతల ప్రయాణ ముఖచిత్రం సమూలంగా మారబోతోంది. రాష్ట్రవ్యాప్తంగా విమానయాన రంగాన్ని విస్తరించాలన్న సంకల్పంతో ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ నుంచి సానుకూల స్పందన లభించింది. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలను పరిశీలించిన కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం సూచించిన అయిదు కీలక ప్రాంతాల్లో కొత్త విమానాశ్రయాల ఏర్పాటుకు పచ్చజెండా ఊపింది. ఈ నిర్ణయంతో ఉత్తర తెలంగాణ నుంచి దక్షిణ తెలంగాణ వరకు పారిశ్రామిక, పర్యాటక రంగాల్లో నూతన అధ్యాయం మొదలవుతుందని ఆశించవచ్చు. ముఖ్యంగా మౌలిక సదుపాయాల కల్పనలో వెనుకబడిన జిల్లాలకు ఈ విమానాశ్రయాల రాకతో కొత్త ఊపిరి అందనుంది. కేంద్ర ప్రభుత్వం అంగీకారం తెలిపిన విమానాశ్రయాల జాబితాలో నిజామాబాద్ జిల్లాలోని జక్రాన్‌పల్లి, పెద్దపల్లి జిల్లాలోని అంతర్గావ్, భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్ ప్రాంతాలు ఉన్నాయి. వీటితో పాటు వరంగల్‌లోని మామూనూరు విమానాశ్రయం పునరుద్ధరణ పనులకు కూడా మార్గం సుగమమైంది. ఇప్పటికే మామూనూరు విమానాశ్రయానికి సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం కావడంతో, అక్కడ పనులు వేగవంతం కానున్నాయి. ఒకేసారి అయిదు ప్రాంతాల్లో విమానాశ్రయాల ఏర్పాటుకు సాంకేతిక అనుమతులు లభించడం రాష్ట్ర రవాణా రంగంలో ఒక మైలురాయిగా నిలవనుంది. దీనివల్ల రాష్ట్ర రాజధానికి దూరంగా ఉన్న ప్రాంతాల ప్రజలకు గంటల తరబడి ప్రయాణించే అవస్థలు తప్పుతాయి. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లిలో విమానాశ్రయం ఏర్పాటు అనేది ఆ ప్రాంత రైతాంగానికి, వాణిజ్యవేత్తలకు ఎంతో మేలు చేకూర్చనుంది. ముఖ్యంగా పసుపు ఎగుమతులకు ఈ విమానాశ్రయం కేంద్ర బిందువుగా మారే అవకాశం ఉంది. అలాగే పెద్దపల్లి జిల్లాలోని అంతర్గావ్ పారిశ్రామికంగా ఎంతో ప్రాముఖ్యత కలిగిన ప్రాంతం. రామగుండం ఎరువుల కర్మాగారం, సింగరేణి గనులు ఉండటంతో ఇక్కడ విమాన రాకపోకలు పెరగడం వల్ల ఆర్థిక కార్యకలాపాలు మరింత జోరందుకుంటాయి. ఆదిలాబాద్ లాంటి మారుమూల ప్రాంతాలకు గగనతల అనుసంధానత లభించడం వల్ల అక్కడి గిరిజన ప్రాంతాల అభివృద్ధికి, పర్యాటక రంగానికి విశేషమైన గుర్తింపు లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు. కొత్తగూడెం విమానాశ్రయం నిర్మాణం వల్ల భద్రాద్రి రామయ్యను దర్శించుకునే భక్తులకు, సింగరేణి అధికారులకు ఎంతో సౌకర్యవంతంగా మారుతుంది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ఈ ప్రాంతంలో వాయు మార్గం అందుబాటులోకి వస్తే పెట్టుబడులు పెరిగే అవకాశం మెండుగా ఉంది. వరంగల్ మామూనూరు విమానాశ్రయం విషయానికి వస్తే, ఇది చారిత్రక నగరానికి పూర్వ వైభవం తీసుకురావడంలో కీలకం కానుంది. ఐటీ కంపెనీలు వరంగల్‌కు తరలివస్తున్న క్రమంలో విమానాశ్రయం ఉండటం అనేది ఐటీ నిపుణులకు, కంపెనీల యాజమాన్యాలకు పెద్ద ఊరటగా మారుతుంది. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయితే తెలంగాణ అంతటా విమాన ప్రయాణం సామాన్యులకు సైతం అందుబాటులోకి వస్తుంది. అయితే ఈ భారీ ప్రాజెక్టుల అమలులో రాష్ట్ర ప్రభుత్వానికి భూసేకరణ అనే పెద్ద అడ్డంకి ఎదురుకానుంది. వరంగల్ మినహా మిగిలిన నాలుగు ప్రాంతాల్లో విమానాశ్రయాల నిర్మాణానికి అవసరమైన భూమిని సేకరించడం అధికారులకు సవాలుగా మారింది. భారీ విస్తీర్ణంలో భూమి అవసరం కావడంతో స్థానిక రైతుల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. భూసేకరణకు భారీగా నిధులు కేటాయించడంతో పాటు, రైతులకు సముచితమైన పరిహారం చెల్లించడంలో జాప్యం జరిగితే ప్రాజెక్టులు కుంటుపడే ప్రమాదం ఉంది. ఇప్పటికే ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు గడ్డుగా ఉండవచ్చునని తెలుస్తోంది. కేంద్రం నుంచి సానుకూల సంకేతాలు అందినప్పటికీ, వరంగల్ మినహా మిగతా చోట్ల భూసేకరణ వేగంగా జరగాల్సి ఉంది. భూసేకరణతో పాటు పర్యావరణ అనుమతులు, ఇతర సాంకేతిక క్లియరెన్సులు రావడానికి చాలా సమయం పట్టే అవకాశం ఉంది. ప్రభుత్వం చెల్లించే పరిహారం విషయంలో బాధితులకు, అధికారులకు మధ్య సమన్వయం కుదరడం ప్రాజెక్టు వేగాన్ని నిర్ణయిస్తుంది. ఏటా పెరుగుతున్న భూముల ధరల దృష్ట్యా, పరిహారం నిర్ణయించడం ప్రభుత్వానికి భారంగా మారనుంది. అందుకే అధికారులు ఈ విషయంలో అత్యంత జాగ్రత్తగా ముందడుగు వేయాలని ప్రణాళికలు రచిస్తున్నారు. సామాజిక ప్రభావ అంచనా కూడా ఈ ప్రాజెక్టుల భవిష్యత్తును ప్రభావితం చేయనుంది. మరోవైపు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వంత జిల్లా అయిన మహబూబ్‌నగర్‌లో విమానాశ్రయం ఏర్పాటుకు కేంద్రం నో చెప్పడం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం దేవరకద్ర ప్రాంతంలో విమానాశ్రయ నిర్మాణానికి స్థలాన్ని ప్రతిపాదించింది. కానీ కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ దీనిని తిరస్కరించడానికి బలమైన కారణాలను పేర్కొంది. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా కావడంతో ఇక్కడ విమానాశ్రయం వస్తుందని ఆశించిన స్థానికులకు ఈ వార్త నిరాశ కలిగించింది. అయినప్పటికీ భద్రత, సాంకేతిక అంశాలను విస్మరించలేమని కేంద్రం స్పష్టం చేసింది. దీనివల్ల మహబూబ్‌నగర్ వాసులు విమాన ప్రయాణం కోసం హైదరాబాద్‌పైనే ఆధారపడాల్సి ఉంటుంది. మహబూబ్‌నగర్‌లో విమానాశ్రయం సాధ్యం కాకపోవడానికి ప్రధానంగా మూడు కారణాలు ఉన్నాయని కేంద్రం వివరించింది. మొదటిది, దేవరకద్ర వద్ద ప్రతిపాదించిన స్థలం శంషాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయానికి 80 కిలోమీటర్ల లోపే ఉండటం. నిబంధనల ప్రకారం రెండు విమానాశ్రయాల మధ్య కనీస దూరం ఉండాల్సి ఉంటుంది. శంషాబాద్ విమానాశ్రయం అత్యంత రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో, దాని సమీపంలో మరొక విమానాశ్రయం ఏర్పాటు చేయడం విమానాల రాకపోకల నియంత్రణలో ఇబ్బందులకు దారితీస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇదే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం తన నివేదికలో స్పష్టంగా పేర్కొంది. రెండవ అతిపెద్ద అడ్డంకి జి.ఎం.ఆర్ సంస్థతో ఉన్న ఒప్పందం. శంషాబాద్ విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్న జీఎంఆర్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం, విమానాశ్రయం చుట్టూ నిర్ణీత కిలోమీటర్ల పరిధిలో మరో విమానాశ్రయం ఏర్పాటు చేయాలంటే ఆ సంస్థ నుంచి నిరభ్యంతర పత్రం తప్పనిసరిగా తీసుకోవాలి.



# గిన్నిస్ వరల్డ్ రికార్డ్ కైవసం చేసుకున్న కరాటే మాస్టర్ చందు



- 20 నిమిషాల్లో 40సార్లు కరాటే కటా ప్రదర్శనతో అరుదైన ఘనత
- ప్రపంచ వేదికపై మెరిసిన స్థానిక కరాటే మాస్టర్

**విశాలభారతి, గోదావరిఖని:** పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఫైవ్ఇంక్లైన్ ఏరియాకు చెందిన డ్రాగన్ షోటోకాన్ కరాటే క్లబ్ వ్యవస్థాపకుడు, కరాటే మాస్టర్ పసునూటి చందు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన ఘనత సాధించారు. ఈనెల 26న హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ కటా ప్రోగ్రాంలో పాల్గొని తన ప్రతిభను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో సుమారు రెండు వేల మంది పాల్గొనగా, చందు కేవలం 20 నిమిషాల్లో 40సార్లు కరాటే కటా ప్రదర్శన చేసి వరల్డ్ రికార్డ్ సాధించి గిన్నిస్ బుక్ లో తన పేరు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ..చిన్నప్పటినుండి కరాటే పై ఆసక్తి, నిరంతరం సాధన చేస్తూ ఈ స్థాయికి చేరుకున్నానని, క్రమశిక్షణ, పట్టుదల, గురువుల మార్గదర్శకత ఉంటే ఎవరైనా గొప్ప విజయాలు సాధించగలరని అన్నారు. ఈ గిన్నిస్ రికార్డు సాధించడం తనకు ఎంతో సంతోషంగా ఉందని, భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ స్థాయి అవార్డులు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు పేర్కొన్నారు. కాగా చందు ఈ ఘనత సాధించడంపట్ల ఎస్ఎఫ్కెఐ ఇండియా చీఫ్ రచ్చ శ్రీను బాబు, పెద్దపల్లి జిల్లా కరాటే దూ అసోసియేషన్ మాస్టర్లు పసునూటి శంకర్, తగరపు శంకర్, కరాటే శ్రీనివాస్, ఒడ్డెపల్లి సురేష్, మంథని నాగరాజు తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

# లేఔట్ అనుమతుల్లో పారదర్శకతకు ప్రాధాన్యం

- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్.



**మహబూబాబాద్, విశాలభారతి:** జిల్లాలో లేఔట్ అనుమతుల ప్రక్రియను మరింత పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఆమె అధ్యక్షతన జిల్లాస్థాయి లేఔట్స్ కమిటీ సమావేశం నిర్వహించబడింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐదు మున్సిపల్ పరిధుల నుంచి లేఔట్ అనుమతుల కోసం ఐదు దరఖాస్తులు అందగా, సంబంధిత విభాగాల అధికారులు వాటిని సమగ్రంగా పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్న మూడు దరఖాస్తులకు కమిటీ ఆమోదం తెలిపింది. ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, రెవెన్యూ తదితర విభాగాల ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదేశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విధానాల ప్రకారం లేఔట్ అనుమతుల కోసం అవసరమైన అన్ని పత్రాలను సమర్పించాలని సూచించారు. ప్రభుత్వ భూములపై ఎలాంటి అక్రమ వెంచర్లు చేపట్టరాదని, ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్వే, రెవెన్యూ శాఖలు ప్రభుత్వ భూములను కాపాడటంలో అప్రమత్తంగా ఉండాలని, టౌన్ ప్లానింగ్ మరియు మున్సిపల్ విభాగాలు దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే, అన్ని సంబంధిత శాఖల సిబ్బంది గ్రామాలు, పట్టణాల్లో ప్రభుత్వ భూములపై నిరంతర తనిఖీలు నిర్వహించి వాటి రక్షణకు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్, రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణవేణి, జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారి సాయిరాం, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, మున్సిపల్ కమిషనర్లు మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టుల అండతోనే కార్మిక హక్కుల పరిరక్షణ

- నల్లు సుధాకర్ రెడ్డి సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు



**డోర్నకల్, విశాలభారతి:** శ్రమ జీవుల పక్షపాత పార్టీ కమ్యూనిస్టుల అండతోనే కార్మికుల హక్కులు కాపాడబడుతాయనీ సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు. డోర్నకల్ మున్సిపల్ కేంద్రం జైన్ భవన్ లో జరిగిన పార్టీ సమావేశంలో ఎల్లవుల నరసింహరావు నాయకత్వం లో పలువురు పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి, సభ్యత్వం అందజేసిన సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దేశ సంపద కారుచౌకగా కట్టబెడుతూ, కార్మిక హక్కులను కాలరాస్తున్నదని, మేడే సందర్భంగా కార్మిక శక్తి చాటుతూ వాడవాడలా ఎర్రజెండాలు ఏగురవేసి, హక్కుల పరిరక్షణ కోసం సంఘటిత ఉద్యమాలకు సమర శంఖం పూరించాలని కోరారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి, ప్రభుత్వాల ఎన్నికల హామీలు అమలు చేయాలని, ప్రజా సమస్యలే ఎజెండా గా ప్రజా ఉద్యమాలు కొనసాగించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నెల్లూరు నాగేశ్వర రావు మండల కార్యదర్శితురక రమేష్, కే ప్రబేష్, జున్ను స్వామి, కె ప్రభాకర్, గోపి తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప భక్తుల ఆధ్వర్యంలో అన్నదానం



**మరిపెడ, విశాలభారతి :** అన్ని దానాలలో కెల్లా అన్నదానం గొప్పదని స్వామి అయ్యప్పన్ అన్నదాన సంతర్పణ కమిటీ అధ్యక్షుడు గంధసిరి రమేష్ అన్నారు.అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రమైన పవిత్ర ఉత్తర నక్షత్ర పర్వదినం సందర్భంగా మరిపెడ పట్టణంలోని అలంకార్ సెంటర్ లో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి నెల ఉత్తర నక్షత్రం పార్వదినాన్ని పురస్కరించుకొని అయ్యప్పస్వామి వారికి అభిషేకాలు, పడిపూజను నిర్వహించి అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ఏబిఏపి జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య,గుండగాని సుందర్,ఇస్లావత్ నగేష్,మామిడాల మునేష్,తల్లాడ అశోక్, వెంకటనారాయణ,బొడ్డు సంపత్,పులకాని నవీన్ రెడ్డి,నాగేశ్వర రావు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాల ప్రచారంలో సమాచార శాఖను తీర్చిదిద్దాలి

- రాష్ట్ర జర్నలిస్టుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నారగౌని పురుషోత్తం



**విశాలభారతి , హైదరాబాద్:** ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాలంటే సమాచార పౌర సంబంధాల శాఖ తన ప్రచార శైలిని మరింత ఆధునీకరించుకోవాలని తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నారగౌని పురుషోత్తం అన్నారు. ఐఅండ్ పీఆర్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ముకుంద రెడ్డిని మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో టీఎస్జేయూ ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసింది.ఈ సందర్భంగా నారగౌని పురుషోత్తం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వినూత్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సమాచార శాఖది కీలక పాత్ర అని నొక్కి చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను జోడించి, ప్రచార విభాగాలను బలోపేతం చేయడం ద్వారా పథకాల లబ్ధిని ప్రజలకు మరింత చేరువ చేయవచ్చని ఆయన ఆకాంక్షించారు. అనుభవజ్ఞులైన ముకుంద రెడ్డి నేతృత్వంలో శాఖ కొత్త పుంతలు తొక్కుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అదేవిధంగా జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన సమస్యల పరిష్కారంపై కూడా కమిషనర్ సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్జేయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ముత్యం ముఖేష్‌గౌడ్ తదితరులు పాల్గొని కమిషనర్‌ను ఘనంగా సన్మానించారు.

# ఐకెపి కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్

- గింజ కటింగ్ లేకుండా కొనుగోలు, రైతు సమస్యలపై రాజీ పడే ప్రసక్తి లేదు
- ప్రతి గింజ కొనుగోలు చేస్తాం. కొనుగోలు జరిపిన వెంటనే ఖాతాలోకి డబ్బులు జమ



**విశాలభారతి, రామగుండం:**

జనగామ మరియు పాలకుర్తి మండల పరిధిలో పలు ఐకెపి సెంటర్లను కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించిన రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుల నుండి కటింగుల పేరిట కొనుగోలు సెంటర్లలో ధాన్యంను నిలువు దోపిడి చేశారని అన్నారు. ఆరుగాలం కష్టపడి రక్తాన్ని చెమటగా మార్చి రైతులు పండించిన పంటలను కటింగుల పేరిట బిఆర్ఎస్ పెద్దలు దోచుకు తిన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సమస్యల విషయంలో తాను ఏనాడు రాజీ పడేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో రైతులకు కూడా సంపూర్ణమైన నమ్మకం విశ్వాసం తనపై ఉందన్నారు. రామగుండం నియోజకవర్గంలోని ప్రతి ఒక్క రైతు కూడా తనను రైతుబిడ్డగా చూడటం సంతోషంగా ఉందన్నారు. అయితే రైతు సమస్యలను పరిష్కరించడంలో తన కష్టాన్ని కూడా గుర్తించాలని ఆయన ప్రజలను కోరారు. కొనుగోళ్ల విషయంలో రైస్ మిల్లర్ నుండి ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని కోరారు. సన్న వడ్లకు బోనస్ అందించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అలాగే, రైతు భరోసా విషయంలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని ఆయన కోరారు. విడతల వారిగా రైతు భరోసా ను ప్రభుత్వం విడుదల చేస్తోందని చెప్పారు. అలాగే సెంటర్లలో కొనుగోలు పూర్తయిన వెంటనే ఒకటి రెండు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ విషయంలో గతంలో పోలిస్తే బిఆర్ఎస్ హయాంలో రోజుల తరబడి డబ్బుల కోసం రైతులు పడిగాపులు కాశారని అన్నారు. రైతులు తరచూ వరి పంట కాకుండా పంటల మార్పిడి పై శ్రద్ధ చూపాలని కోరారు. సేంద్రియ ఎరువులను వాడితే భూసారం పెరుగుతుందన్నారు. రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి అలుపెరుగని కృషి చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఇంటింటికి ఇసుకను సులభతరం చేసిన ఘనత కూడా తమదేనన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేందుకు అహోరాత్రులు కష్టపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గ్రామాల సర్పంచ్ లు, ఉపసర్పంచ్ లు, వార్డు సభ్యులు మరియు మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు, రైతులు, గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# లేబర్ కోడ్ల రద్దుకై తిరుగుబాటు ప్రకటిద్దాం

- ప్రపంచ కార్మికులారా ఏకంకండి _ మేడే వర్ధిల్లాలి
- సిపిఐ 141 వ మేడే ను జయప్రదం చేయండి

**తిరుమలగిరి, విశాలభారతి :**

మంగళవారం రోజు న తొండ గ్రామంలో సిపిఐ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం కామ్రేడ్ తిపిరాల శ్రీకాంత్ అధ్యక్షతనకు ఉదయం 11 గంటలకు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు తుంగతుర్తి నియోజకవర్గ ఇన్చార్జ్ కామ్రేడ్ ఎల్లంల యాదగిరి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు 1886 మే 1 కార్మిక్ హార్వెస్టర్ అనే సంస్థలో సమ్మె జరిగింది. సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి మే 3వ తేదీనాడు వేరే కార్మికులతో పని చేయించటానికి ప్రయత్నించింది. అందుకు నిరసనగా మే 3వ తేదీన మే కార్మిక్ హార్వెస్టర్ కంపెనీ కార్మికులు సభను నిర్వహిస్తుండగా యజమాన్యం సభ పై దాడి చేయించి, ఘర్షణ జరుగుతుండగా పోలీసులు రంగంలోకి దించి కాల్పులు జరిపించింది. నలుగురు కార్మికులు అక్కడికక్కడే మరణించగా, అనేకమంది గాయపడ్డారు. ఈ అత్యాకాండ కు నిరసనగా నేషనల్ లేబర్ యూనియన్స్ ఆఫ్ అమెరికా కెనడాలోని అనేక కార్మిక సంఘాలు 1886 మే 4వ తేదీన చికాగో నగరం మధ్యలో ఉన్న హే మార్కెట్ లో కార్మికుల భారీ నిరసన సభను నిర్వహించారు. ఈ నిరసన మే కార్మిక్ హార్వెస్టర్ యజమాన్యానికి వ్యతిరేకంగా మరియు ప్రభుత్వ అండతో పోలీసులు జరిపిన విచక్షణారహిత కాల్పులు జరిపారు. ఈ బహిరంగ సభలో 1) స్పెయిన్ 2) పార్సన్ 3) ఫిషర్ మొదలగు కార్మిక నాయకులు ప్రసంగించారు.చికాగొ మేయర్ శాంతి ఈ పరిరక్షణ కొరకు సైదులు అయిన పోలీసులతో హాజరైనారు. స్పెయిన్ పర్సన్ ప్రసంగాల తర్వాత ఫిల్ మెన్ ఉపన్యాసం ప్రారంభమైంది.సభ ప్రశాంతంగా జరుగుతుందని మేయర్ అక్కడ ఉన్న పోలీస్ స్కార్డ్లను వెళ్లిపొమ్మని చెప్పి, ఆయన సభా ప్రాంతాన్ని వదిలి వెళ్లిపోయారు. కానీ పోలీసులు వెళ్లలేదు.పోలీస్ స్కాడ్ సభ స్థలం దగ్గరికి వచ్చింది. సభలో అనేకమంది కార్మికులు వెళ్లిపోయి చివరగా 250 మంది మాత్రమే మిగిలారు. సాయిధ పోలీసులు మాత్రమే 150 మంది ఉన్నారు. పోలీస్ అధికారి కెప్టెన్ జాన్ బన్ ఫీల్డ్ కార్మికులను చెదిరిపొమ్మని ఆజ్ఞాపించారు.సభ దగ్గరలోనే అంతకుల ముఠా నాయకుడైన పీకర్టన్ మనుషుల దగ్గర ఉన్న కొద్ది నిమిషాలలో సభ ముగుస్తుంది అన్న ఒక మాటల బాంబు వచ్చి పోలీసుల ముందు పడింది.పోలీస్ సర్జంట్ డేగన్ చనిపోయాడు. మరొక 80 మందికి గాయాలయ్యాయి.ఆ వెంటనే పోలీస్ తుపాకులు పోయాయి 10 మంది కార్మికులు అక్కడికక్కడే చనిపోయారు. ఇంత పెద్ద ఎత్తున ఘర్షణలు జరుగుతున్నప్పటికీ కార్మిక నాయకులు పారిపోకుండా అక్కడే ఉన్నారు. రక్తసిక్తమైన హే మార్కెట్ ప్రాంతంలో అక్కడే నిలబడి ఉన్న పిన్, స్వచ్, ఫిలన్ , ఫిషర్, ఎంగిల్, లింగ్, వెబ్ పర్సన్లను రెస్ట్ చేశారు.కార్మికుల రక్తం కాలువలై పారుతుంటే చనిపోగా మిగిలిన కార్మికులు వాళ్ల ఒంటిమీద ఉన్న బట్టలను ఆ రక్తంలో ముంచి ఎర్ర జెండాగా ఎగరేశారు.ఆనాటి నుండి నేటి వరకు ప్రపంచవ్యాప్తంగా మే ఒకటో తారీఖున మేడే దినోత్సవం కార్మికులంతా ఒక పండుగ దినముగా ఎర్రజెండాలు ఎగరేసి చికాగో అమరవీరులకు జోహార్లు అర్పించి వారిని గుర్తు చేసుకుంటారు. అందులో భాగంగానే తుంగతుర్తి నియోజకవర్గ అన్ని గ్రామాలలో సిపిఐ జెండాలు ఎగరేసి మేడేను ఘనంగా నిర్వహించి,జయప్రదం చేయాలని ఆయన కోరారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను 44 కార్మిక చట్టాలలో అతి ముఖ్యమైన 29 కార్మిక చట్టాల రద్దు వ్యాపార వర్గాలైన పెట్టుబడిదారులకు అనుకూలంగా 4 లేబర్ కోడ్ లు తెచ్చింది ఈ కోట్ల వల్ల కార్మికుల పనిగంటలను 8 గంటల పనిదినానికి బదులు 12 గంటల పని పనిచేయించుకొని యజమాన్యం శ్రమ దోపిడి చేస్తున్నారు. అంతేకాకుండా రైతు వ్యతిరేక ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దెదించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి ఎస్కె ఫయాజ, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తీపిరాల శ్రీకాంత్, మరియు సుంచు సత్తయ్య ఎల్లంల కొమురయ్య, కొదురుపాక ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

# నింగి కెగసిన ఆదివాసి యువ కెరటం

- తెల్లం నరేష్ అకాల మరణం ఆదివాసి సమాజానికి తీరని లోటు
- విద్యార్థి ఉద్యమ లలో క్రియాశీలక పాత్ర తెల్లం నరేష్ ది
- ఏజెన్సీ చట్టాల రక్షణకై రణం చేసిన ఉద్యమ శాలి
- నివాళులర్పించిన కంగాల రమణకుమారి

**భద్రాచలం, విశాలభారతి:**



భద్రాచలం డివిజన్లో ఆనాటి విద్యార్థి దశ నుండి ఉద్యమాల పట్ల ఆకర్షితులైన తెల్లం నరేష్ విద్యార్థి ఉద్యమ నాయకుడిగా విద్యార్థి సమస్యల పట్ల క్రియాశీలక పాత్ర పోషించాడని మహా జన సమితి ఆదివాసి మహిళా రాష్ట్ర కన్వీనర్ కంగాల రమణకుమారి తెలిపారు ఈ సందర్భంగా ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. అనంతరం కంగాల రమణకుమారి మాట్లాడుతూ సీతానగరం చిన్న పల్లెటూర్లో పుట్టిన తెల్లం నరేష్ విద్యార్థి దశ నుండే ఆనాటి ఎస్ఎఫ్ఐ ఉద్యమాల్లో తనదైన పాత్ర పోషించాడని విద్యార్థులకు వచ్చే సమస్యల పైన చదువుతూ పోరాడు చదువుకై పోరాడని నినాదంతో చురుకైన పాత్ర నిర్వహించాడని ఆమె పేర్కొన్నారు . అలాగే ఆదివాసి ఉద్యమాలలో తనదైన పాత్ర నిర్వహించారని ఏజెన్సీ చట్టాలను రక్షించే దాంట్లో ఆయన గొంతును వినిపించాడని ఆమె అన్నారు. కాంగ్రెస్ పార్టీలో అంచలంచెలుగా ఎదిగి ప్రస్తుతం ఎస్టీ సెల్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గా పదవి బాధ్యతలు స్వీకరించారని ఆమె అన్నారు. ఆదివాసులకు జరుగుతున్న అన్యాయం పైన నిరంతరం తపించి పోయాడని మొక్కవోని దీక్షతో ఆయన శ్రమించాడని ఆయన కృషి మరువలేనిదని ఆమె కొనియాడారు. అతి చిన్న వయసులోనే అకాల మరణం చెందటం అత్యంత బాధాకరమైన విషయమని ఆదివాసి సమాజానికి తీరని లోటుగా భావించాలని ఆమె వివరించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ఆమె ప్రకటించారు.

# విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు




**విశాలభారతి, గోదావరిఖని:** రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా రామగుండం కమిషనరేట్ ఆంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఎస్.ఐ. శైలజ ఆధ్వర్యంలో మంగళవారం రోజున నాలుగు విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమాలు సెంట్ క్లేర్స్ హై స్కూల్ (ఎన్‌టీపీసీ), శ్రీ చైతన్య డిగ్రీ కాలేజ్ (గోదావరిఖని), కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాల (సీసీసీ, నస్పూర్), మరియు ఏకలవ్య ఆశ్రమం - సేవా భారతీ (మంచిర్యాల)లో నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఎస్.ఐ. శైలజ విద్యార్థులకు లింగ సమానత్వం,బాల్య వివాహాల నిర్మూలన, పిల్లల భద్రత, పితృస్వామ్య భావజాలం, మహిళలపై ద్వేషం, లింగ వివక్ష , జెండర్ బైయాస్, హింస,సైబర్ నేరాలు మరియు సైబర్ బులీయింగ్ వంటి ముఖ్య అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు.అదేవిధంగా షీ టీమ్స్ కార్యకలాపాలు, మహిళలు మరియు పిల్లలు ఎదుర్కొనే సమస్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అలాగే అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాల్సిన హెల్ప్‌లైన్ నంబర్లు — డయల్ 100, 112, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 గురించి వివరించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, సమాజంలో బాధ్యతగల పౌరులుగా ఎదగాలని సూచించారు.ఈ కార్యక్రమాల ద్వారా యువతలో భద్రతపై అవగాహన పెంపొందించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు.

# డ్రగ్స్‌కు దూరంగా.. చదువుకు దగ్గరగా ఉండాలి

**కలెక్టర్ రాజర్షి షా**




**ఆదిలాబాద్, విశాలభారతి:** బాలల రక్షణ, వారి ఉజ్వల భవిష్యత్తును కాపాడటం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయంలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా టీనేజ్ గర్భాల నివారణ, ఎలోప్‌మెంట్, డ్రగ్స్ నివారణ పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యువత "డ్రగ్స్‌కు దూరంగా చదువుకు దగ్గరగా" ఉంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల సరఫరాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. టీనేజ్ గర్భాలు, బాల్య వివాహాల వల్ల బాలికల ఆరోగ్యం, భవిష్యత్తు దెబ్బతింటుందని, ఇలాంటి అనర్థాలపై గ్రామ స్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు ప్రేమ వ్యవహారాలు, కేసుల బారిన పడకుండా పాఠశాలల్లో ప్రత్యేక కౌన్సెలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆపదలో ఉన్న బాలల కోసం 24 గంటలూ అందుబాటులో ఉండే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌ను వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కలెక్టర్ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ సింగ్ రాథోడ్, ప్రిన్సిపల్ లలిత, ఇతర అధికారులు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# జొన్నల కొనుగోలు కేంద్రాలు పెంచాలని కాంగ్రెస్ బృందం విజ్ఞప్తి



**ఆదిలాబాద్, విశాలభారతి:** ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గంలో జొన్నల కొనుగోలు కేంద్రాలను పెంచాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతి పత్రం సమర్పించారు.నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు జొన్నలు అమ్ముకునే సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కనీసం ప్రతి మండలానికి రెండు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని వారు కోరారు. అలాగే కొనుగోలు చేసిన జొన్నల తరలింపులో సమస్యలు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భోద్దు గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్, మాజీ ఏఎంసి డైరెక్టర్ మహమ్మద్ అబ్రార్, సీనియర్ నాయకులు పన్నాల శమేందర్ రెడ్డి, కుమ్మరి పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# 'చైల్డ్ సేఫ్టీ – డ్రగ్స్‌కు నో చెప్పండి' అవగాహన కార్యక్రమం

**క్రీడా సామగ్రి, స్టేషనరీ వస్తువులను పంపిణీ చేసిన పోలీస్ కమిషనర్**



**విశాలభారతి, రామగుండం :** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా రామగుండంలోని తబితా ఆశ్రమంలో "చైల్డ్ సేఫ్టీ - డ్రగ్స్‌కు నో చెప్పండి" అనే అంశంపై రామగుండం సీఐ శ్రీ ప్రవీణ్ కుమార్, ఎస్.ఐ .సంధ్యరాణి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీ అంబర్ కిషోర్ ఝా , పెద్దపల్లి డీసీపీ శ్రీ బి. రామ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా విద్యార్థులకు పిల్లల భద్రతకు సంబంధించిన ముఖ్యమైన అంశాలను వివరించారు.అలాగే మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, మానసిక ప్రభావాలు మరియు భవిష్యత్ జీవనశైలిపై వాటి దుష్ప్రభావాల గురించి అవగాహన కల్పించారు.యువత డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండి,క్రమశిక్షణతో శ్రద్ధగా చదువుకోవాలని, మంచి అలవాట్లు అలవరచుకుని ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పాటించాలని సూచించారు.అదేవిధంగా విద్యార్థుల శారీరక,మానసిక అభివృద్ధిని ప్రోత్సహించే ఉద్దేశంతో ఆశ్రమంలోని పిల్లలకు క్రీడా సామగ్రి మరియు స్టేషనరీ వస్తువులను పంపిణీ చేశారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలో కూడా రాణించి,మంచి భవిష్యత్తు కోసం కృషి చేయాలని ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ శ్రీ బి. రామ్ రెడ్డి ,రామగుండం సీఐ శ్రీ ప్రవీణ్ కుమార్, రామగుండం ఎస్.ఐ. సంధ్య రాణి , ఎన్‌టీపీసీ ఎస్.ఐ. ఉదయ్ కిరణ్ , పోలీస్ సిబ్బంది, ఆశ్రమం నిర్వాహకులు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ కోదండరాంకి శుభాకాంక్షలు వెల్లువ

**సికింద్రాబాద్, విశాలభారతి :**

తెలంగాణ ఉద్యమ నేత ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం వివిధ ఉద్యమ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు కోదండరాం కి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఇందులో తెలంగాణ ఉద్యమకారుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మల్లూరి అనిల్ కుమార్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు ఓరుగంటి ఆనంద్, జానకి రెడ్డి, విష్ణు, కొత్తం యాది రెడ్డి, వివిధ సంఘ నాయకులు కలిసి కోదండరాం కి శుభాకాంక్షలు, సన్మానం చేయడం జరిగింది.



# దారి మైసమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజాసేవకు మరింత అంకితం: రాజ్ ఠాకూర్



**విశాలభారతి, రామగుండం:** రామగుండం నియోజకవర్గంలో నూతనంగా నిర్మాణం జరుగుతున్న దారి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాగూర్ భక్తి శ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ నిర్మాణ పనులు సాఫీగా పూర్తై, ప్రజలకు ఆధ్యాత్మిక క్షేమం కలగాలని కోరుతూ మైసమ్మ తల్లికి ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, దేవాలయాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ప్రజల్లో ఐక్యత, భక్తి భావాలను పెంపొందించే కేంద్రాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. దారి మైసమ్మ తల్లి కరుణతో రామగుండం ప్రాంతం సుఖశాంతులతో, అభివృద్ధితో ముందుకు సాగాలని ప్రార్థించినట్లు తెలిపారు.ఆలయ అభివృద్ధి, ఆధ్యాత్మిక వాతావరణం పెంపొందించేందుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులుగా తాము ఎల్లప్పుడూ సహకరిస్తామని ఆయన స్పష్టం చేశారు. స్థానిక ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.దారి మైసమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలకు మరింత సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాగూర్ తెలిపారు.

# మంత్రి సీతక్క పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



**నిజామాబాద్, విశాలభారతి:** రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి, నిజామాబాద్ ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్క బుధవారం నిజామాబాద్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో మంత్రి పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో ఇంచార్జి మంత్రి పాల్గొననుండగా, కలెక్టర్ ఆడిటోరియంను సందర్శించారు. ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఇంచార్జి అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, డీఆర్డీఏ సాయన్న, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, డీడబ్ల్యూఓ పద్మ తదితరులు ఉన్నారు.

# మహిళల భద్రత పిల్లల రక్షణ పై అవగాహన సదస్సు




**నిజామాబాద్, విశాలభారతి:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం,మహిళల భద్రత పిల్లల రక్షణ పై అవగాహన సదస్సు పెర్కిట్ పరిధిల సదస్సును డబ్ల్యూఎస్ఐ పుష్పావతి, ఎస్ఐ అప్పారావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. జిల్లా పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, ఐపీఎస్., ఆదేశానుసారంగా ఈ కార్యక్రమం చేపట్టమని తెలిపారు.మహిళల భద్రత, బాలల రక్షణ, లింగ సమానత్వం, పితృస్వామ్యం, జెండర్ బైయాస్, సైబర్ నేరాల నివారణ, బాల్య వివాహాల నిర్మూలన . భరోసా సెంటర్ సేవలపై అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలు తమ హక్కులపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని, పితృస్వామ్య భావనలు మరియు జెండర్ వివక్షను గుర్తించి ఎదుర్కోవాలని, సైబర్ మోసాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, బాల్య వివాహాల నివారణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అధికారులు ఇలాంటి అవగాహన కార్యక్రమాలను గ్రామ స్థాయిలో మరింత విస్తరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎం ఇందిరా, కోఆర్డినేటర్ రోజా, సపోర్ట్ పర్సన్ సవిత, మౌనిక. ట్రైనింగ్ సెంటర్ విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎస్సైకి ఘన సన్మానం

**పరకాల జాల్ తండా ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వక భేటీ**




**మరిపెడ, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలోని అధికారిక పోలీస్ స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సైను పరకాల్ జాల్ తండా గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ గూగులోతు రాము, గ్రామ పార్టీ అధ్యక్షుడు బానోతు కొండయ్య మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. మరిపెడ పోలీస్ స్టేషన్ జిల్లా పరిపాలనా అధికారిక జాబితాలో నమోదైన కీలక శాంతిభద్రతా కేంద్రంగా కొనసాగుతోంది.ఈ సందర్భంగా గ్రామ సమస్యలు, తండా పరిసరాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, యువతలో పెరుగుతున్న సామాజిక అవగాహన, గ్రామ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ కావాల్సిన అవసరంపై వారు ఎస్సైతో చర్చించినట్లు తెలిసింది. ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన ధ్యేయమని, గ్రామస్తుల సహకారంతో నేర నియంత్రణలో ముందుంటామని ఎస్సై హామీ ఇచ్చారు.పోలీస్ – ప్రజల మధ్య సమన్వయం బలపడితేనే గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొంటుందని గూగులోతు రాము పేర్కొన్నారు. గ్రామ ప్రజల తరపున ఎస్సైకి పూర్తి సహకారం అందిస్తామని బానోతు కొండయ్య తెలిపారు. నూతన అధికారి రాకతో మరిపెడ మండలంలో పోలీసింగ్ మరింత పటిష్టం అవుతుందనే ఆశాభావం వ్యక్తమైంది.

# రైతన్నకు అండగా సొసైటీ కొనుగోలు కేంద్రం

**గిరిపురం సర్పంచ్ బాదావత్ నీలా సైదులు నాయక్**

**మరిపెడ, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని గిరిపురం గ్రామంలో రైతులకు మేలు చేకూరేలా సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ బాదావత్ నీలా సైదులు నాయక్ ప్రారంభించారు. రైతులు తమ పండించిన ధాన్యాన్ని మధ్యవర్తుల చేతుల్లో నష్టపోకుండా నేరుగా ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించుకునేలా ఈ కొనుగోలు కేంద్రం ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రైతు ఏడాది పొడవునా కష్టపడి పండించిన ప్రతి గింజకు సరైన ధర దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గ్రామ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తూకం, రవాణా, హమాలి, తేమ శాతం నమోదు తదితర ప్రక్రియలను సక్రమంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.రైతు సంక్షేమమే గ్రామాభివృద్ధికి పునాది అని, రైతన్న ఆనందంగా ఉంటే గ్రామం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని సర్పంచ్ పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రం ప్రారంభం కావడంతో గిరిపురం గ్రామ రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ సీఈవో బొల్లెపల్లి నరేష్, గిరిపురం గ్రామ పార్టీ అధ్యక్షులు వల్లెపు కొండయ్య, గ్రామ సీనియర్ నాయకులు బాదావత్ సైదులు నాయక్, ఉప సర్పంచ్ వీరన్న, మాజీ ఉపసర్పంచ్ సురేష్, వార్డు మెంబర్లు బదావత్ జనార్దన్, మంగ్తి, పిఎసిఎస్ సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# చంపాపేట్ డివిజన్‌లో ఎంపీ ఈటల రాజేందర్ పర్యటన

- అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి
- డ్రైనేజీ, వరద సమస్యల పరిష్కారానికి హామీ

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**



ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ పరిధిలో ఎంపీ ఈటల రాజేందర్ పర్యటించి పలు కాలనీలలో స్థానిక సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా బైరాముల గూడ చెరువు, ఎం.ఆర్.ఆర్ కాలనీ, చంపాపేట్ చౌరస్తా, మారుతి నగర్ కాలనీ, సామ సరస్వతి నగర్ కాలనీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బైరాముల గూడ మద్దెల చెరువు మురికి నీటితో కలుషితమై ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని తెలిపారు. గతంలో దివంగత నేత వంగ మధు ప్రయత్నాలతో డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటు చేసినప్పటికీ, సరైన నిర్వహణ లేకపోవడం, పైప్‌లైన్ సామర్థ్యం తక్కువగా ఉండటంతో సమస్య కొనసాగుతోందని చెప్పారు. చెరువులోకి మురికి నీరు చేరకుండా అదనపు పైప్‌లైన్ ఏర్పాటు చేసి సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చెరువు పరిసరాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని పేర్కొంటూ, వాటిని అరికట్టేందుకు పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసే అంశంపై అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎం.ఆర్.ఆర్ కాలనీలో వరదనీటి సమస్య పరిష్కారానికి రూ.6 కోట్ల వ్యయంతో బాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, వాటిని వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. యాదగిరి నగర్ కాలనీలో రూ.7 కోట్లతో చేపట్టిన వరద కాలువ పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్ నగరం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో డ్రైనేజీ, పైప్‌లైన్ వ్యవస్థలను విస్తరించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత చురుకుగా వ్యవహరించాలని సూచిస్తూ, ప్రత్యేక అధికారులు ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ మాజీ కార్పొరేటర్లు కొప్పుల నరసింహా రెడ్డి, శ్వేతా మధుకర్ రెడ్డి, నరసింహ గుప్తా, చింతల సురేందర్ యాదవ్, పవన్ కుమార్, చంపాపేట్ డివిజన్ అధ్యక్షులు పోరెడ్డి రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు సద్ది సందీప్ రెడ్డి, లింగాల దశరథ గౌడ్, సుంకరి రమేష్ గౌడ్, లంకల రమేష్ రెడ్డి, శ్రీనివాస్ నాయుడు, గూడూరు అవినాష్ రెడ్డి, పాశం శ్రీశైలం, గూడూరు శ్రీనివాస్ రెడ్డి, రాజేష్, సిల్వర్ అనిల్, యోగిరాజ్, శేఖర్, శ్రవణ్, వేణు, నరేందర్ రెడ్డి, శ్రీధర్ గౌడ్, వేణు గౌడ్, నరేష్, బసంత్ పాల్గొన్నారు.

# పేపర్ ప్లేట్లు వద్దు-స్టీల్ ప్లేట్లే ముద్దు

**దేవరుప్పల, విశాలభారతి:**





జనగణన ట్రైనింగ్ లో భాగంగా దేవరుప్పుల ఉన్నత పాఠశాలలో సూపర్వైజర్లకు, ఎన్యూమరేటర్లకు జరుగుతున్న రెండో రోజు శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులు లంచ్ సమయంలో పేపర్ ప్లేట్లకు బదులుగా స్టీల్ ప్లేట్లలో భోజనం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. పేపర్ ప్లేట్లు వినియోగించడం వలన పర్యావరణానికి ఎంతో హానికరం, మరియు పేపర్ ప్లేట్లు వాడటం వల్ల కలిగే ఆరోగ్య దుష్ప్రభావాలు చాలా తీవ్రంగా ఉంటాయి, ముఖ్యంగా వేడి ఆహారాన్ని వాటిలో తిన్నప్పుడు. వైద్య నిపుణుల హెచ్చరికల ప్రకారం, వాటి వల్ల కలిగే ప్రధాన నష్టాలు ఇక్కడ ఉన్నాయి అవి క్యాన్సర్ ముప్పు, హార్మోన్ల అసమతుల్యత, తీవ్రమైన జీర్ణ సమస్యలు,కాలేయ, కిడ్నీ సమస్యలు, రోగనిరోధక శక్తి తగ్గడం లాంటి ఎన్నో ఆరోగ్యానికి హానికరమనే విషయాన్ని దృష్టిలో ఉంచుకొని పేపర్ ప్లేట్లకు బదులు స్టీల్ ప్లేట్లు వినియోగించినట్లు వారు తెలిపారు. అదేవిధంగా టీ ని పేపర్ కప్పుల్లో బదులు స్టీల్ కప్పులలో తాగారు... క్యాన్సర్ కారకాలైన పేపర్ కప్పులు, పేపర్ ప్లేట్ల వినియోగాన్ని ఎంత తక్కువగా వాడితే అంత మంచిదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు చెప్పారు.. ఇకనుండి అన్ని శిక్షణ కార్యక్రమాలలో పేపర్ ప్లేట్లకు బదులు స్టీల్ ప్లేట్లు వాడతామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. పేదింటి పెళ్లిళ్ల నుంచి ఫైవ్ స్టార్ హోటల్ ఫంక్షన్ వరకు ప్రస్తుత కాలంలో వీటి వినియోగం గణనీయంగా పెరిగింది.పేపర్ ప్లేట్లలో ఉండే చిన్న చిన్న ప్లాస్టిక్ కణాలు శరీరంలోకి వెళ్లి క్యాన్సర్ కారకాలతో పాటు అనేక అనారోగ్య సమస్యలు తెచ్చిపెడతాయని కావున పేపర్ ప్లేట్ల వినియోగాన్ని తగ్గిద్దామని వారు తెలియజేశారు. పేపర్ ప్లేట్లు వద్దు! స్టీల్ ప్లేట్లే ముద్దు! అని నినదించారు. ఈ కార్యక్రమంలో ఎన్యూమరేటర్లు శివగారి కిరణ్ కుమార్, బాస్కుల అంజయ్య, బానోతు వెంకన్న, దాసరి వెంకన్న, సుహాసిని, మాధవి, మాలతి లత, జ్యోతి, భాగ్యలక్ష్మి, సుజాత, ధనలక్ష్మి, స్రవంతి, సౌందర్య, వినోద, రోజా తదితరులు పాల్గొన్నారు.

# అమరుల త్యాగాలతో ఎరుపెక్కిన దినం మేడే: సిపిఐ నాయకులు




**వాల్ పోస్టర్ ఆవిష్కరణలో కార్మిక హక్కుల కోసం ఐక్య పోరాటానికి పిలుపు**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**

అమెరికాలోని చికాగో నగరంలో కార్మికులు చిందించిన నెత్తుటి త్యాగ ఫలితమే నేటి మేడే అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి పేర్కొన్నారు. 141వ మేడే సందర్భంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్ పోస్టర్‌ను మంగళవారం రావి నారాయణరెడ్డి కాలనీ ఫేజ్ 3 భూ పోరాట కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు, సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్ మండల కార్యదర్శి అజ్మీర హరిసింగ్ నాయక్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా ఆందోజు రవీంద్ర చారి, ముత్యాల యాదిరెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా కార్మికులు అనేక పోరాటాలు చేసి ప్రాణాలు అర్పించి తమ హక్కులను సాధించుకున్నారని తెలిపారు. అనేక కార్మిక చట్టాలు కూడా పోరాటాల ద్వారానే సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. అడిగితే హక్కులు రావని, పోరాటం ద్వారానే సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తోందని విమర్శిస్తూ, నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు, పాత చట్టాల అమలు, భవన నిర్మాణ కార్మికులకు ప్రమాద భీమా, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం, కార్మికులకు గౌరవప్రదమైన వేతనాలు వంటి డిమాండ్ల కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మేడే రోజున ప్రతి ప్రాంతంలో జెండాలు ఎగురవేసి మేడే స్ఫూర్తిని చాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, బిఓసి జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి ప్రసాద్, పొన్నాల యాదగిరి, AIYF, AISF నాయకులు మధు, వినోద్ నాయక్, బిఓసి అబ్దుల్లాపూర్ మెట్ మండల ప్రధాన కార్యదర్శి దవుల రాములు, ఈశ్వరయ్య, బాల్ రెడ్డి, లాలప్ప, వెంకటేష్, పాండు, రాములు, అశోక్, శోభన్, ప్రియా, అన్నపూర్ణ, నీలా, రాణి, కావేరి, రవళి, అలివేలు, నాగరాణి, మధుసూన్ తదితరులు పాల్గొన్నారు.

# కాప్రా జీహెచ్ఎంసి కార్యాలయంలో ఏసీబీ రైడ్స్ చేయాలి









- చల్లపల్లి డివిజన్లో జోరుగా అక్రమ నిర్మాణాలు
- తూ తూ మంత్రంగా నోటీసులు
- అవినీతిమత్తులో టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది
- పట్టించుకోని ఉన్నతాధికారులు

**కాప్రా, విశాలభారతి:**

అక్రమ నిర్మాణాలకు చర్లపల్లి డివిజన్ నిలయంగా మారింది. అక్రమ నిర్మాణాలకు తూ తూ మంత్రంగా నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్న జీహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు, సెక్షన్ ఆఫీసర్ లు, చైన్ మెన్ లు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని రైల్వే స్టేషన్ మెయిన్ రోడ్ లో, బీఎన్ రెడ్డి కాలనీలో యధేశ్చగా నిబంధనలకు విరుద్ధంగా ఏసీపి కృష్ణ మోహన్, సెక్షన్ ఆఫీసర్ తుల్జాసింగ్, చైన్ మెన్ ల ఆధ్వర్యంలో నిర్మాణాలు. టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమాలు అడ్డుకోకుండా తమ జోబులు నింపుకునే పనిలో నిమగ్నమయ్యారాని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంటనే ఏసీబీ అధికారులు కాప్రా జీహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారులపై దాడులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

# జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు ఘన సన్మానం

**నాగర్ కర్నూల్ బదిలీ సందర్భంగా మాజీ కార్పొరేటర్ల అభినందనలు**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** ఎల్. బి. నగర్ జోనల్ కమిషనర్‌గా బాధ్యతలను విజయవంతంగా నిర్వహించిన ఐఏఎస్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్ నాగర్ కర్నూల్‌కు బదిలీ అయిన సందర్భంగా హయత్ నగర్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మరియు ఎల్. బి. నగర్ పరిధిలోని తాజా మాజీ కార్పొరేటర్లు కలిసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎల్. బి. నగర్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి జోనల్ కమిషనర్‌గా హేమంత్ కేశవ్ పాటిల్ చేసిన సేవలు ఎంతో ప్రశంసనీయమని అన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అభివృద్ధి కార్యక్రమాలకు విశేష కృషి చేసి ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు.హయత్ నగర్ డివిజన్ అభివృద్ధికి ఆయన అందించిన సహకారం ఎంతో విలువైనదని, పలు అభివృద్ధి పనుల పురోగతిలో ఆయన పాత్ర కీలకమైందని పేర్కొన్నారు. నాగర్ కర్నూల్‌లో కూడా ఇదే సేవా భావంతో ప్రజలకు సేవలందిస్తూ మరింత గుర్తింపు పొందాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ప్రాంత అభివృద్ధికి ఆయన చేసిన విశేష సేవలకు గుర్తింపుగా ఈ సన్మానం నిర్వహించడం ఆనందంగా ఉందని, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎల్. బి. నగర్ తాజా మాజీ కార్పొరేటర్లు కొప్పుల నరసింహారెడ్డి, నాయి కోటి పవన్ కుమార్, బీజేపీ హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గోవింద చారి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలం కబ్జా.. శ్లోకా కన్వెన్షన్ హాల్‌పై హైడ్రా దర్యాప్తు

- దాదాపు రూ.10 కోట్ల విలువైన భూమి ఆక్రమణ ఆరోపణలు
- స్థలాన్ని పరిశీలించిన హైడ్రా అధికారులు




**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల డివిజన్ పరిధిలోని కొంగరకలాన్ ప్రాంతంలో ఉన్న శ్లోకా కన్వెన్షన్ హాల్ మరోసారి వివాదంలోకి వచ్చింది. ప్రభుత్వ భూమిని కబ్జా చేశారన్న ఆరోపణలతో ఈ వ్యవహారం ప్రాధాన్యం సంతరించుకుంది. తెలంగాణ భూముల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో హైడ్రా ప్రధాన కార్యాలయానికి సోమవారం ఫిర్యాదు చేయడంతో అధికారులు రంగంలోకి దిగారు. ఈ నేపథ్యంలో మంగళవారం హైడ్రా అధికారులు సంబంధిత స్థలాన్ని పరిశీలించారు.ఫిర్యాదుదారుల వివరాల ప్రకారం, శ్లోకా కన్వెన్షన్ హాల్ యాజమాన్యం సర్వే నంబర్లు 388, 389, 390 పరిధిలో దాదాపు 1348 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిందని ఆరోపించారు. ఈ భూమి విలువ సుమారు రూ.10 కోట్ల వరకు ఉంటుందని వారు తెలిపారు. కబ్జాకు గురైన స్థలాన్ని హైడ్రా అధికారి సీఐ సైదులు పరిశీలించి వివరాలు సేకరించారు. ఆక్రమణ ఆరోపణలపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమవగా, ప్రభుత్వ భూముల పరిరక్షణపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# బ్రహ్మోత్సవాలకు పల్లె గోపాల్ గౌడ్‌కు ఆహ్వానం

- కొంగరకలాన్ గ్రామంలో 75వ బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు




**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ఇబ్రహీంపట్నం మండలం కొంగరకలాన్ గ్రామంలో జరగనున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి 75వ బ్రహ్మోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిందిగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పల్లె గోపాల్ గౌడ్ కి ఆహ్వాన పత్రికను అందజేశారు. దేవాలయ కమిటీ చైర్మన్ నీళ్ల రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ ఆహ్వానం అందజేయబడింది.బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్థులు ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ గౌడ సంఘం అధ్యక్షులు చింతాకుల యాదయ్య గౌడ్, కొంగరకలాన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నీళ్ల యాదయ్య గౌడ్, మాజీ ఉప సర్పంచ్ రమేష్ నాయక్, నీళ్ల రాజు గౌడ్, దండిగా శేఖర్ యాదవ్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల విడుదలకు బీఆర్ఎస్వీ ఆందోళన

- హైకోర్టు కమిషన్‌కు పోస్టుకార్డుల ద్వారా విజ్ఞప్తి

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చిన నేపథ్యంలో నియోజకవర్గంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి.జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి సూచన మేరకు నియోజకవర్గంలోని పలు ఇంజనీరింగ్, ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో బీఆర్ఎస్వీ నాయకులు పోస్టుకార్డుల ద్వారా హైకోర్టు కమిషన్‌కు తమ విజ్ఞప్తులను తెలియజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు రంగోలి అరుణ్ గౌడ్ (బన్నీ) మాట్లాడుతూ.. విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఈ సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు పాల్గొని తమ మద్దతును తెలియజేశారు.



# సమ్మర్ క్యాంప్ ప్రారంభించిన డీజీపీ

**రాజేంద్రనగర్, విశాలభారతి :**
తెలంగాణ రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ (డీజీపీ) బి. శివధర్ రెడ్డి, ఐపీఎస్ హైదరాబాద్ బండ్లగూడ సమీపంలో తెలంగాణ పోలీస్ అకాడమీ లో సిబ్బంది సంక్షేమ కార్యక్రమాల భాగంగా నిర్వహిస్తున్న పిల్లల సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ శిబిరానికి మొత్తం 65 మంది పిల్లలు నమోదు చేసుకుని ఉత్సాహంగా పాల్గొంటున్నారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా పిల్లలకు నిర్మాణాత్మక, అభివృద్ధి దిశగా మార్గనిర్దేశం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు. శారీరక, సృజనాత్మక మరియు మేధోపరమైన కార్యకలాపాల సమ్మేళనం ద్వారా పిల్లల సమగ్ర అభివృద్ధికి ఈ క్యాంప్ దోహదపడనుంది. సభను ఉద్దేశించి మాట్లాడిన డీజీపీ బి. శివధర్ రెడ్డి గారు తన చిన్ననాటి వేసవి సెలవుల జ్ఞాపకాలను స్మరించుకున్నారు. స్వగ్రామంలో తాత మామల వద్ద గడిపిన రోజులు, గ్రామీణ వాతావరణంలో ఈత కొట్టడం, మామిడి తోటలను సందర్శించడం వంటి అనుభవాలు వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. పిల్లల్లో సాంస్కృతిక అవగాహన పెంపొందించడంతో పాటు తెలుగు భాషపై ఆసక్తి కలిగించేలా తెలుగు తరగతులు, ప్రముఖ కవుల పద్యాలు, శతకాలను కూడా ఈ క్యాంప్‌లో చేర్చాలని సూచించారు. తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాషా బిష్ట్, ఐపీఎస్ గారు మాట్లాడుతూ, ఈ సమ్మర్ క్యాంప్ అకాడమీ సిబ్బంది సంక్షేమానికి తోడు సామాజిక బాధ్యత పట్ల తమ కట్టుబాటుకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. పిల్లలు నేర్చుకోవడానికి, అన్వేషించడానికి మరియు తమ ప్రతిభను అభివృద్ధి చేసుకునేందుకు అనువైన వాతావరణాన్ని కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ సమ్మర్ క్యాంప్‌లో ఈత, యోగా, పెయింటింగ్, డ్రాయింగ్, చెస్ వంటి విభిన్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భవిష్యత్తులో సంగీతం, నాటకం, నృత్యం, నటన వంటి కళారంగ కార్యకలాపాలను కూడా చేర్చే ప్రతిపాదన ఉందని ఆమె తెలిపారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో భద్రతా ప్రమాణాలతో కూడిన క్రమబద్ధమైన శిక్షణను అకాడమీ అందిస్తోంది. ఈ సందర్భంగా, ఈ నెల 30న పదవీ విరమణ పొందనున్న డీజీపీ బి. శివధర్ రెడ్డి, ఐపీఎస్ గారు మరియు ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు, ఐపీఎస్ గార్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వారి విశిష్ట సేవలు, నాయకత్వం మరియు రాష్ట్రంలో పోలీసింగ్ ప్రమాణాల అభివృద్ధికి చేసిన కృషిని ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమానికి డీజీపీ (లా , ఆర్డర్) మహేష్ భాగవత్, ఐపీఎస్, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు, ఐపీఎస్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం. రమేష్ తదితర ఉన్నతాధికారులు హాజరై అభినందనలు తెలిపారు. అధికారులు, సిబ్బంది తల్లిదండ్రులు మరియు పిల్లలు ఉత్సాహంగా పాల్గొని తెలంగాణ పోలీస్ అకాడమీ సమ్మర్ క్యాంప్‌కు శుభారంభం కల్పించారు.




## మల్ రెడ్డి వెంటనే మా ప్రయాణం.. కాంగ్రెస్‌లో చేరిన రాయపోల్ సర్పంచ్

- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌కు గుడ్‌బై
- ఇబ్రహీంపట్నం అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని సర్పంచ్ వ్యాఖ్య



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణకు నిదర్శనంగా రాయపోల్ గ్రామ సర్పంచ్ అచ్చన మమత శ్రీశైలం బీఆర్ఎస్ పార్టీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సమక్షంలో ఆమెతో పాటు పలువురు వార్డు సభ్యులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. మల్ రెడ్డి వెంటనే మా ప్రయాణం అంటూ కాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్ అచ్చన మమత శ్రీశైలం మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధి ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి నాయకత్వంలోనే సాధ్యమని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి కోసం కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేసే వారికి పార్టీలో సముచిత గౌరవం ఉంటుందని స్పష్టం చేశారు. రాయపోల్ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. రాయపోల్ సర్పంచ్ చేరికతో స్థానికంగా కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అయ్యిందని నాయకులు అభిప్రాయపడ్డారు. గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్‌కు పెరుగుతున్న మద్దతు రాబోయే రోజుల్లో నియోజకవర్గ రాజకీయాల్లో కీలక మార్పులకు దారితీస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శేఖర్ మామ, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గండిమైసమ్మ దేవాలయంలో భద్రతా ఏర్పాట్లపై పోలీసుల తనిఖీ



**రాజేంద్రనగర్, విశాలభారతి :** భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని గండిపేటలోని గండిమైసమ్మ దేవాలయంలో నర్సింగి పోలీసులు మంగళవారం భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. నర్సింగి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ శ్రీ జి. హరి కృష్ణ రెడ్డి, సెక్టార్ ఎస్ఐ శ్రీరామ్ గోపి కలిసి దేవాలయాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను సమీక్షించారు. దేవాలయానికి రోజూ పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అధికారులు తెలిపారు. ముఖ్యంగా పండుగలు, వారాంతాల్లో రద్దీ అధికంగా ఉండే నేపథ్యంలో భద్రతను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ అధికారి శ్రీ మాణిక్ ప్రభుతో మాట్లాడిన అధికారులు, దేవాలయం పరిసరాల్లో కీలక ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం, అలాగే లోపల మరియు వెలుపల తగిన వెలుతురు సదుపాయాలను మెరుగుపరచాలని సూచించారు. దీని ద్వారా భక్తుల భద్రతతో పాటు దేవాలయ ఆస్తుల రక్షణ కూడా సాధ్యమవుతుందని తెలిపారు. అదనంగా, భక్తుల రద్దీ నియంత్రణ కోసం అవసరమైన ఏర్పాట్లు చేయడం, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను సక్రమంగా నిర్వహించడం వంటి అంశాలపై కూడా సూచనలు చేశారు. దేవాదాయ శాఖ అధికారులు ఈ సూచనలపై తక్షణ చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

## హమాలీల కూలి రేట్లు పెంచాలని సీఐటీయూ డిమాండ్

- 14 రోజుల్లో సమస్యలు పరిష్కరించకపోతే పనులు బంద్‌కు హెచ్చరిక



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మండలం బాటసింగారం గ్రామంలో ఉన్న గడ్డి అన్నారం పండ్ల మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీలకు గత నాలుగు సంవత్సరాలుగా కూలి రేట్లు పెంచలేదని సీఐటీయూ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. గడ్డి అన్నారం ఫ్రూట్స్ మార్కెట్ హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో మార్కెట్ సెక్రటరీ శ్రీనివాస్‌కు సమస్య వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్ర మోహన్ మాట్లాడుతూ.. హమాలీలకు నాలుగు సంవత్సరాలుగా కూలి రేట్లు పెరగకపోవడం అన్యాయమని అన్నారు. వెంటనే ఈ నెల నుంచే కొత్త రేట్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. 14 రోజుల లోపు సమస్యలు పరిష్కరించకపోతే పనులను బంద్ చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. మార్కెట్ సెక్రటరీ శ్రీనివాస్ స్పందిస్తూ హమాలీల సమస్యలను పరిశీలించి తప్పకుండా ఆలోచిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఇ. నర్సింహా, హమాలీ జిల్లా కార్యదర్శి వీరన్న, వేంకన్న, శివ కుమార్ బల్‌రాజ్, మార్కెట్ హమాలీ అధ్యక్షులు మసూద్ బాయ్, శారీఫ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నాగలింగేశ్వర స్వామి 8వ వార్షికోత్సవం

**ప్రత్యేక పూజలు చేసిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ**



**ఆల్విన్ కాలనీ, విశాలభారతి:** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని దత్తాత్రేయ కాలనీలో గల శ్రీ శ్రీ శ్రీ నాగలింగేశ్వర స్వామి దేవస్థానం 8వ అష్టమ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు తాజా మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు గాంధీని ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆలయాల అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, భక్తులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## కేంద్రమంత్రితో మంత్రి వాకిటి శ్రీహరి భేటీ



**రాజేంద్రనగర్, విశాలభారతి :**
రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డ్ (NFDB) కార్యాలయంలో కేంద్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్‌తో రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో మత్స్యశాఖ డైరెక్టర్ నిఖిల, పశుసంవర్ధక శాఖ అధికారి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో పశుసంవర్ధక, పాడి, మత్స్య రంగాల్లో అమలు చేస్తున్న పథకాలు మరియు వాటి ఫలితాలను మంత్రి వాకిటి శ్రీహరి కేంద్రమంత్రికి వివరించారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి మరింత సహకారం అందించాలని ఆయన కోరారు. సమావేశం అనంతరం కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్‌ను మంత్రి శ్రీహరి శాలువా, పూల బొకే, మెమెంటోతో సన్మానించారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో పశుసంవర్ధక, పాడి, మత్స్య రంగాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయని తెలిపారు. ఆక్వా కల్చర్, లైఫ్ సైన్సెస్ ఇన్సూరెన్స్, మోపెడ్ కేటాయింపులు వంటి అంశాలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. రాష్ట్రాలకు కేంద్రం సమానంగా నిధులు కేటాయించాలని ఆయన అభిప్రాయపడ్డారు. గోదావరి, కృష్ణా నదుల పరివాహక ప్రాంతాల్లో ఉన్న 46 వేల పెద్ద చెరువులు, 26 వేల చిన్న చెరువులు, 100 రిజర్వాయర్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే, రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఫిషరీస్ డెవలప్ మెంట్ బోర్డ్ కార్యాలయాన్ని తరలించబోతున్నారనే ప్రచారంపై కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. దీనిపై స్పందించిన కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్, NFDBను తరలించే ఆలోచన లేదని, అదే ప్రాంతంలో కొనసాగుతుందని హామీ ఇచ్చినట్లు మంత్రి శ్రీహరి వెల్లడించారు.

## పెట్రోల్, డీజిల్ కొరత నివారణకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలి

**సిపిఎం ఆధ్వర్యంలో నిరసన, మండల తహసిల్దార్‌కు వినతి**

**భద్రాచలం , విశాలభారతి:**
భద్రాచలం పట్టణంలో గత రెండు, మూడు రోజులుగా పెట్రోల్ కొరతతో వాహన వినియోగదారులు, వ్యాపారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే పెట్రోల్, డీజిల్ కొరత నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గద్దం స్వామి లు డిమాండ్ చేశారు. సిపిఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పెట్రోల్ డీజిల్ కొరత నివారించాలని కోరుతూ స్థానిక అంబేద్కర్ సెంటర్లో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం మండల తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వరరావు కు వినతి పత్రం అందించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పెట్రోల్, డీజిల్ కొరత నివారణకు చర్యలు చేపడతామని తహసిల్దార్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంబి నర్సారెడ్డి, గద్దం స్వామిలు మాట్లాడుతూ భద్రాచలం పట్టణంలోని పలు పెట్రోల్ బంకు యజమానులు "నో స్టాక్ బోర్డులు" పెడుతున్నారని కొన్ని బంకుల వద్ద వందలాది వాహనాలు బార్లు తీరి వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. దేశంలో రాష్ట్రంలో పాలకులు పెట్రోల్ డీజిల్ కొరత లేదని, అన్ని చర్యలు చేపడుతున్నామని ప్రగల్భాలు పలకడం సోచనీయమన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండా జిల్లా కలెక్టర్ పెట్రోల్, డీజిల్ కొరత లేదని ప్రకటన చేయడం ప్రజలను గందరగోళానికి గురిచేస్తుందని అన్నారు. పెట్రోల్ డీజిల్ కొరత లేకుంటే పెట్రోల్ బంకులు ఎందుకు మూతపడతాయని ప్రశ్నించారు. అదే విధంగా వంట గ్యాసు తో పాటు వ్యాపారస్తులకు డొమెస్టిక్ గ్యాస్ సరఫరా సక్రమంగా అందకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తక్షణమే ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి భద్రాచలం పట్టణంలో నెలకొన్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరతను నివారించేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కమిటీ సభ్యులు నకరికంటి నాగరాజు, అజయ్ కుమార్, కుంజా శ్రీనివాస్, ధనకొండ రాఘవయ్య, భూపేంద్ర, సీనియర్ నాయకులు ఎం వి ఎస్ నారాయణ, బి జె ఎల్ పి దాసు, ముత్తయ్య, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి రవీందర్, కొరసా రవి, కారు అడ్డ యూనియన్ నాయకులు సుబ్బారావు, ఖలీలు, భాష్యం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## సీపీఐ సీనియర్ నాయకులు వేముల వెంకటేశ్వర్లు మృతి

**నివాళులర్పించిన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం**

**పాల్వంచ, విశాలభారతి :**
సీపీఐ సీనియర్ నాయకులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా సీపీఐ సమితి సభ్యులు, మాజీ పట్టణ కార్యదర్శి పాల్వంచకు చెందిన వేముల వెంకటేశ్వర్లు (60) అనారోగ్యంతో మంగళవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. మృతి వార్త తెలుసుకున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు ఉప్పుశెట్టి రాహుల్ కార్పొరేటర్ వీసంశెట్టి విశ్వేశ్వర రావు, జిల్లా సమితి సభ్యులు అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, నరహరి నాగేశ్వరరావు, ఇరుకు రామారావు, సంజీవరావు, అశోక్, అల్లి వెంకటేశ్వర్లు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. ఎర్ర జెండా కప్పి శ్రద్ధాంజలి ఘటించారు, కుటుంబసభ్యులకి సానుభూతి ప్రకటించారు.



## రఫిక్ తండ్రి మరణంపై ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పరామర్శ

- కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి
- బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** హయత్ నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ మైనారిటీ అధ్యక్షులు రఫిక్ తండ్రి మహమ్మద్ సర్దార్ ఇటీవల మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి స్పందించారు. ఈ సందర్భంగా హయత్ నగర్ డివిజన్ పార్టీ అధ్యక్షులు చెన్నగొని శ్రీధర్ గౌడ్‌తో కలిసి రఫిక్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను మర్యాదపూర్వకంగా పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఇలాంటి క్లిష్ట సమయంలో బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ వారి కుటుంబానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ డివిజన్ పార్టీ అధ్యక్షులు చెన్నగొని శ్రీధర్ గౌడ్‌తో పాటు స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలుతదితరులు పాల్గొన్నారు.

## నూతన సమాచార శాఖ కమిషనర్‌ను కలిసిన టీయూడబ్ల్యూజే నేతలు

- జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వినతి



**సైబరాబాద్, విశాలభారతి:** రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జి.ముకుందరెడ్డిని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) నేతలు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ నేతృత్వంలో సచివాలయంలో కమిషనర్‌ను కలిసిన బృందం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ, రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. జర్నలిస్టుల సంక్షేమం, అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాలు తదితర అంశాలపై కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో టీయూడబ్ల్యూజే ఉప ప్రధాన కార్యదర్శి కల్మూరి రాములు, రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## బోడుప్పల్లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం



**బోడుప్పల్, విశాలభారతి:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా 54 వ రోజు బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శైలజ ఆదేశానుసారం బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని పర్వతాపూర్ సత్యనారాయణపురం కాలనీలలో డాగ్ క్యాచింగ్, స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ వంటి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినట్లు బోడుప్పల్ ఏ ఎం ఓ హెచ్ డాక్టర్ చైతన్యకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా బోడుప్పల్ నగరపాలక సంస్థ పరిధిలోని సత్యనారాయణపురం కాలనీలో గల వీధి కుక్కలను వెటర్నరీ డిపార్ట్మెంట్ సహకారంతో పట్టుకొని స్టెరిలైజేషన్ కొరకు పంపించడం జరిగిందని పట్టుకున్న వీధి కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించి. పట్టణ పరిధిలోని వివిధ కాలనీలో వీధి కుక్క లకు త్రాగునీటి తొట్టెలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు స్థానిక ప్రజలు వీధి కుక్కలను దత్తత తీసుకొని వాటికి ఆహారం మరియు తాగునీటిని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏ ఎమ్ ఓ హెచ్ డాక్టర్ చైతన్య కుమార్ వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

## యువకుడు అదృశ్యం.. కేసు నమోదు

- ఇంటినుంచి వెళ్లిన తర్వాత ఆచూకీ లేకపోవడంతో పోలీసుల దర్యాప్తు ప్రారంభం



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** అబ్దుల్లాపూర్ మెట్ మండల పరిధిలో ఓ యువకుడు అదృశ్యమైన ఘటన వెలుగుచూసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఇన్స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఏప్రిల్ 26, 2026 సాయంత్రం 7 గంటలకు పొదుగు ఈశ్వరమ్మ (50), నివాసం సహారా క్వార్టర్స్, రామోజీ ఫిల్మ్ సిటీ, అనాజ్‌పూర్ గ్రామం వారు ఫిర్యాదు చేశారు. ఆమె కుమారుడు పొదుగు యేసు కుమార్ (24), ప్రైవేట్ ఉద్యోగిగా రామోజీ ఫిల్మ్ సిటీలో పనిచేస్తున్నాడు. ఏప్రిల్ 21న ఉదయం పనికి వెళ్లిన యేసు కుమార్, అదే రోజు సాయంత్రం ఇంటికి వచ్చి భోజనం చేసి నిద్రపోయాడు. అయితే, ఏప్రిల్ 22 ఉదయం సుమారు 6 గంటలకు లేచి చూసే సరికి అతను ఇంట్లో కనిపించలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఫోన్ కాల్స్ చేసినప్పటికీ స్పందన రాలేదని పేర్కొన్నారు. దీంతో ఆందోళన చెందిన తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి యువకుడి ఆచూకీ కోసం పోలీసులు దర్యాప్తు ప్రారంభించినట్లు ఇన్స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపారు.

## జక్కిడి శివ చరణ్ రెడ్డి నివాసంలో నవ చండి పారాయణం, చండి హోమం

- సకుటుంబ సమేతంగా నిర్వహించిన పూజా కార్యక్రమం



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ జక్కిడి శివ చరణ్ రెడ్డి నివాసంలో సకుటుంబ సపరివార సమేతంగా నవ చండి పారాయణం, చండి హోమం ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను శ్రీ శ్రీ శ్రీ కొడకండ్ల రాధా కృష్ణ శర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశం, రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, శాంతి, సుభిక్షం కోసం ఈ యాగం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో ఎంతో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జక్కిడి ప్రభాకర్ రెడ్డి దంపతులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సేవాదళ్ శిక్షణ శిబిరంలో జగదీశ్వర్ గౌడ్

- క్రమశిక్షణ, సేవాభావమే సేవాదళ్ బలం.. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో 'సమర్థ' శిబిరం

**శేరిలింగంపల్లి, విశాలభారతి:** సేవాదళ్ అనేది కేవలం సంస్థ కాదని, క్రమశిక్షణ, సేవాభావం, త్యాగం అనే విలువలపై నిలిచిన శక్తివంతమైన వేదిక అని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. టీపీసీసీ సేవాదళ్ ఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏప్రిల్ 27 నుంచి మే 2 వరకు నిర్వహిస్తున్న 'సమర్థశిక్షణ శిబిరం'లో ఆయన మంగళవారం పాల్గొన్నారు. సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, మియాపూర్ యువనాయకుడు యలమంచి ఉదయ్ కిరణ్, శేరిలింగంపల్లి నేతలు విజయభాస్కర్ రెడ్డి, సౌందర్య రాజన్, ప్రణీత్, రత్నాచారి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరం నుంచి సామాజిక న్యాయం వరకు కాంగ్రెస్ పార్టీ ప్రజల హక్కుల కోసం కీలక పాత్ర పోషించిందని తెలిపారు. "కాంగ్రెస్ అంటే సేవ... సేవ అంటే ప్రజల గెలుపు. ప్రజల పక్షాన పోరాటమే సేవాదళ్ ధర్మం" అని ఆయన పేర్కొన్నారు. యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం, దేశ నిర్మాణంలో వారి భాగస్వామ్యం బలపరచడం, కార్యకర్తలను సేవా దిశగా తీర్చిదిద్దడమే శిబిరం ఉద్దేశమని వివరించారు. ఈ శిబిరం ద్వారా కార్యకర్తలు నాయకత్వ నైపుణ్యాలు, ప్రజా సమస్యలపై అవగాహన, క్రమశిక్షణ, ఐక్యత వంటి విలువలను అలవరుచుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తు నాయకులను తీర్చిదిద్దే వేదికగా ఈ శిక్షణ శిబిరం నిలుస్తుందని అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, యువనాయకుడు యలమంచి ఉదయ్ కిరణ్, నేతలు పాల్గొన్నారు.



సేవాదళ్ శిక్షణ శిబిరంలో టీపీసీసీ నేత వి.జగదీశ్వర్ గౌడ్.

విశాల భారతి

# అప్రకటిత విద్యుత్ కోతలు

- హైదర్ నగర్‌లో విధిస్తున్న అప్రకటిత కరెంటు కోతలు
- పడరాని పాట్లు పడుతున్న స్థానిక ప్రజలు


అప్రకటిత విద్యుత్ కోతలు (ఫైల్ ఫోటో )

**శేరిలింగంపల్లి, విశాలభారతి:**

గ్రేటర్ హైదరాబాద్ లో విధిస్తున్న అప్రకటిత కరెంటు కోతలతో ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు.ఓ వైపు మండుతున్న ఎండలు, మరోవైపు కరెంటు ఎప్పుడు ఉంటుందో,ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి.గత కొన్ని రోజులుగా జీహెచ్ఎంసీ వ్యాప్తంగా 40 డిగ్రీల సెల్సియస్ కు పైగా ఉష్ణోగ్రతలు నమోదౌతున్నాయి.వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది.వడగాల్పులు వీస్తున్నాయి. అవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దు, ఇంటి పట్టునే ఉండండి, బయటకు వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోండి అంటూ ప్రతినిత్యం వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తుండగా ప్రజలు ఇండ్లలో కూడా ఉండలేని విధంగా కరెంటు కోతలు ఉంటున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండడం, గంటల పాటు విద్యుత్ అధికారులకు ఫోన్లు చేసినా పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు మండిపడుతున్నారు. దీనికి తోడు అకాల వర్షాలు, గాలులతో పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిచిపోతుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

**అనధికారికంగా కోతలు..!**

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం 24 గంటల పాటు నిరంతరంగా విద్యుత్ సరఫరా చేస్తామని చెప్పిన ప్రభుత్వం కొన్నేళ్ల పాటు ఇచ్చిన హామీకి కట్టుబడి ఉంది.ఇటీవల కాలంలో నగరవ్యాప్తంగా తరచుగా కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. అనధికారికంగా కోతలు విధిస్తున్నారు.ఓ వైపు ప్రభుత్వం నిరంతర విద్యుత్ ఇస్తున్నామని చెబుతున్నప్పటికీ వాస్తవానికి పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. అంతరాయానికి కొంత మంది అధికారులు చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్ నిలిపి వేస్తున్నామని చెబుతున్నారు.ఇలా నగరంలోని చాలా ప్రాంతాలలో అనేక మార్లు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తుండడం పరిస్థితికి అద్దం పడుతుండగా వినియోగదారులకు ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితులు ఉన్నాయి.

**స్పందించని అధికారులు..?**

ప్రస్తుతవేసవిలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తరచుగా విద్యుత్ కోతలు ఉంటుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.వీఐపీలు, సంపన్నులు ఉండే ప్రాంతాలలో ఒకవేళ ఏదేని సాంకేతిక కారణాలతో సరఫరా నిలిచిపోతే వెంటనే పునరుద్ధరిస్తున్న అధికారులు ఇతర ప్రాంతాలలో పట్టించుకోవడంలేదు.గంటల పాటు విద్యుత్ లేకపోవడంతో ప్రజలు తీవ్రఇబ్బందుల పాలవుతున్నారు. ఫ్యూజ్ ఆఫ్ కాల్ తో పాటు ఏఈ, లైన్ మెన్ లకు ఫోన్ చేసినా స్పందించడం లేదని,కొంత మంది అధికారులు అసలు ఫోన్ కూడా ఎత్తకపోవడం పట్ల బస్తీల ప్రజలు మండి పడుతున్నారు.ముఖ్యంగా హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని చాలా బస్తీలలో సమస్య జఠిలంగా ఉంది.ఒక్కో సారి రోజులో పదుల సార్లు విద్యుత్ నిలిచిపోతోంది. హైదరాబాద్ నగరంలో అనధికార కోతలు విధిస్తూనే 24 గంటలు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం ఎంత వరకు సమంజస మని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### చెడిపోతున్న గృహోపకరణాలు..

విద్యుత్ సరఫరా హెచ్చుతగ్గులు కూడా ఉండడంతో గృహోపకరణాలు కూడా పాడవుతున్నాయని పలువురు వాపోతున్నారు. తరచుగా కరెంటు వస్తూ, పోతూ ఉండడంతో ఇండ్లలో టీవీలు,రిఫ్రిజిరేటర్లు,ఇతర విద్యుత్ వస్తువులు,పరికరాలు చెడిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని గతంలో మాదిరి నిరంతరం కరెంటు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని హైదర్ నగర్ డివిజన్ వాసులు కోరుతున్నారు.

## నిరంతర సరఫరా చేయాలి

ఇటీవల కాలంలో తరచుగా కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. అసలే వేసవి కాలం ఎండలు మండుతుండగా ఇలా విద్యుత్ సరఫరా నిలిచిపోతుండడం ఇబ్బందులకు గురిచేస్తోంది. ముఖ్యంగా మధ్యాహ్నం,రాత్రి సమయాలలో చోటు చేసుకుంటున్న కరెంటు కోతలతో చిన్న పిల్లలు, వృద్ధులు పడరాని పాట్లు పడుతున్నారు.దీనికితోడు కరెంటు వస్తూపోతూ ఉండడంతో ఇండ్లలో విద్యుత్ తో నడిచే ఉపకరణాలు చెడిపోతున్నాయి.మరో నెలరోజుల పాటు వేసవి ఎండలు ఉండే అవకాశం ఉన్నందున అధికారులు నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుని విద్యుత్ కోతలు లేకుండా సరఫరా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


— శోభారాణి,హైదర్ నగర్

## ఓర్వలేకనే కోతల వివక్ష..

గత పాలకుల తేబేదారులు కావాలనే కక్ష పూరితంగా వ్యవహరిస్తూ.. కాంగ్రెస్ పార్టీని,రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని చూసి ఓర్వలేక ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. సర్ ప్లస్ కరెంటు ఉండి కూడా విద్యుత్ కోతలు విధిస్తున్నారని మండ్డిపడ్డారు.ఎవరెన్ని కుట్రలు పన్నినా వారి ఆటలు ఇక సాగవని గుర్తుంచుకోవాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యుత్ శాఖ అధికారుల చర్యలను గమనిస్తున్నారని త్వరలో వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకుంటారని తెలిపారు.


— ఎండీ ఫయాజ్ కాంగ్రెస్ నేత

## 82 లక్షలతో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా ప్రారంభం**



**షాద్ నగర్,విశాల భారతి:** కేశంపేట మండలంలోని పాపిరెడ్డిగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని అవాజీమియా పడకల్ గ్రామంలో రూ.82 లక్షల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు ఘనంగా శంకుస్థాపన జరిగింది.ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత గ్రామ ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని,ప్రాంతీయ అభివృద్ధికి ఇది ఎంతో దోహదపడుతుందని తెలిపారు.ఈ సందర్భంగా కీ.శే. తాండ్ర వీరేందర్ రెడ్డి చిరకాల కోరిక నెరవేర్చినందుకు ఎమ్మెల్యేకు మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గూడ వీరేష్, గ్రామ సర్పంచ్ శశిరేఖ యాదయ్య, మాజీ జడ్పీటీసీ విశాల శ్రవణ్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దోపిడీ రహిత సమాజమే ఏఐటీయూసీ లక్ష్యం

- నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాటం తప్పదు
- మేడేను పోరాట దినంగా నిర్వహించాలి: పానుగంటి పర్వతాలు



**మాదాపూర్,విశాలభారతి:** దోపిడీ రహిత సమ సమాజ నిర్మాణమే ఏఐటీయూసీ లక్ష్యమని, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసేవరకు కార్మిక వర్గం పోరాటం కొనసాగిస్తుందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు స్పష్టం చేశారు. మంగళవారం మాదాపూర్ ఆటో స్టాండ్ కూడలిలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కే.చందు యాదవ్ ఆధ్వర్యంలో ఆటో కార్మికులతో కలిసి మేడే పోస్టర్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా పర్వతాలు మాట్లాడుతూ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడేను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లతో కార్మికుల హక్కులకు భంగం కలుగుతోందని విమర్శించారు. అన్ని రంగాల కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పరిశ్రమల్లో ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.రంగారెడ్డి జిల్లాలో లక్షలాది మంది కార్మికుల తరఫున ఏఐటీయూసీ పోరాడుతుందని, మాదాపూర్, గచ్చిబౌలి, మియాపూర్, చందానగర్ ప్రాంతాల్లో వేలాది మంది కార్మికులను ఐక్యం చేసి ఉద్యమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు తుపాకుల రాములు, ఎం.వెంకటయ్య, తిరుపతయ్య, సత్యయ్య, బాలరాజు, రాజు, గోపాల్, సత్యనారాయణ, నరసింహ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కరకగూడెం: డీజిల్ అక్రమ విక్రయాలపై ఉక్కుపాదం

**విశాలభారతి, కరకగూడెం:** మండలంలో డీజిల్‌ను బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై పి.వి.ఎన్.రావు హెచ్చరించారు. స్థానిక పెట్రోల్ బంకులో తనిఖీలు నిర్వహించిన ఆయన.. ఇంధనం నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. అక్రమ నిల్వలు చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని, అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



## మద్యం మాఫియాను అరికట్టాలి

**బెల్ట్ షాపులు ను తక్షణమే రద్దు చెయ్యాలి**

**విశాలభారతి, కరకాగూడెం:**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలంలోని మద్యం వ్యాపారుల కనుసన్నల్లో నడుస్తున్నా బెల్ట్ షాపులను తక్షణమే తొలగించాలని ఆదివాసి సంఘాల (జేఏసీ )కరకగూడెం మండల శాఖ అధ్యక్షులు గోగ్గల కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు..ఈ విషయమై అధికారులు స్పందించకుంటే ఆదివాసి సంఘాల (జేఏసీ )కరకగూడెం మండల శాఖ ఆధ్వర్యంలోఆధ్వర్యంలో అన్ని బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించడం జరుగుతుందనీ హెచ్చరించారు. కరకగూడెం మండలంలో మద్యం శాఖ అధికారులు, మద్యం వ్యాపారులు వారి మనసులతో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న బెల్ట్ షాపులను అరికట్టాకుండ చోద్యం చూడటాన్ని అధికారులును అనుమానించల్సి వస్తుందనీ. జేఏసీ కరకగూడెం మండల శాఖ అధ్యక్షులు గోగ్గల కృష్ణ పేర్కొన్నారు. కనీస నిబంధనలు పాటించడం లేదని అడుగు అడుగునా ఎటు చుసిన బెల్ట్ షాపులు కనిపిస్తున్నాయని. మద్యం షాపుల్లో అయితే ఎం ర్ పి ధరలకే విక్రయించాల్సి వస్తుందనీ. మద్యం వ్యాపారులే బెల్ట్ షాపుల్లో అయితే ప్రతి బాటిల్ కి 50 రూపాయలు అదనంగా పెంచి విక్రయించొచ్చని. మద్యం షాపుల్లో లేని అన్ని రకాల బ్రాండ్స్, బెల్ట్ షాపుల్లో కి పంపించి మద్యం ప్రియులను విచ్చాలవిడిగా దోచుకుంటున్నారనీ. ఈ దోపిడీనీ అరికట్టాలనీ జేఏసీ మండల కమిటీ డిమాండ్ చేస్తుందన్నారు. బెల్ట్ షాపులు నియంత్రణ పై మద్యం శాఖ అధికారులు కనీస ద్రుష్టి కూడా పెట్టడం లేదని అన్నారు. మద్యం వ్యాపారులు ఇష్టరాజ్యంగా వ్యవహారిస్తూ ఉంటే అధికారులు చోద్యం చూడటం తగదన్నారు. మద్యం వ్యాపారులకు బెల్ట్ షాపులకు ఉన్న లింకు ప్రజలకు అర్థం అవుతున్న అధికారులు మాములు మత్తులో ఏమి పట్టనట్టు వ్యవహారిస్తున్నారనీ వాపోయారు, బెల్ట్ షాపులు రద్దు కోసం యువతతో అన్ని గ్రామాల్లో ఉద్యమం కార్యాచరణ ప్రణాళిక ప్రక్రియ ఏర్పాటు చేస్తాం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో ఆదివాసీ సంఘాల సమన్వయ (జేఏసీ) కమిటీ మండల అధ్యక్షులు గోగ్గల కృష్ణ, ప్రధాన కార్యదర్శి పోలే బోయిన ప్రేమ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపు కోసమే కృత్రిమ కొరత

**న్యూడెమోక్రసీ నేత ఆవునూరి మధు**

**పాల్వంచ, విశాలభారతి:**




పెట్రోల్ డీజిల్ రేట్ల పెంపుకోసమే ప్రభుత్వాలు సృష్టిస్తున్న కృత్రిమ కొరత అని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ ఆవునూరి మధు అన్నారు. న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా పెట్రోల్,డీజిల్ కొత్త పై కొత్తగూడెం పెట్రోల్ బంకులో పరిశీలన చేసిన అనంతరం పోస్ట్ ఆఫీస్ పెట్రోల్ బంక్ సెంటర్ మరియు బస్టాండ్ సెంటర్లలో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. అనంతరం కామ్రేడ్ ఆవునూరి మధు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కావాలని దేశంలో సరిపడా పెట్రోల్ డీజిల్ ఉన్న ధరల పెరుగుదల కోసమే కేంద్రం మోడీ ప్రభుత్వం ఆయిల్ కంపెనీలు కుమ్మక్కై ఈ కృత్రిమ కొరతను సృష్టిస్తున్నాయి. ఈ కొత్త మూలంగా అన్ని రకాల నిత్యవసర సరుకుల ధరలు పెరగనున్నాయి. కాబట్టి ప్రభుత్వం ఈ ప్రజావ్యతిరేక వైఖరిని అర్థం చేసుకొని ప్రజలు ప్రజాస్వామికవాదులు వ్యతిరేకించాలని కోరారు. వివిధ రాష్ట్రాలలో ఎన్నికల అనంతరం పెట్రోల్ డీజిల్ ధరలను పెంచనున్నాయి ఈ ప్రమాదకర పరిస్థితిని ప్రజానీకం అర్థం చేసుకొని ప్రభుత్వాల ఈ వైఖరిని వ్యతిరేకిస్తూ ప్రజా ఉద్యమాలకు రావాల్సిందిగా పిలుపునిచ్చారు. ఈ పెట్రోల్ డీజిల్ సమస్య వలన మొత్తం అభివృద్ధి కార్యక్రమాలు కూడా కుంటుపడ్డాయని వారన్నారు. తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.మరోపక్క కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు జిల్లా యంత్రాంగం ఎస్పీ, కలెక్టర్లతో సహా అందరూ డీజిల్, పెట్రోల్ కొరతలేదని ఎవరు కంగారు పడవద్దు అని చెబుతూనే ఈ కృత్రిమ సమస్యను సృష్టిస్తున్నారని వారు అన్నారు. పెట్రోల్,డీజిల్ తక్షణమే బంకులలో సరఫరా చేయాలని, నిలుపుదల చేసుకొని పెట్రోల్ బంకులు మూసిన యజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, డివిజన్ నాయకులు ఎన్ సంజీవ్,మంకెన వెంకటేశ్వర్లు,మోత్కూరి మల్లికార్జునరావు,బి.వెంకటమ్మ, లిక్కి నరేష్,వెంకటేశ్వర్లు, మరియు ప్రణయ్,ధమరుకేష్,మంతేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ నగర్ మార్కెట్ యార్డులో చలివేంద్రం ప్రారంభం

**వేసవి ఎండల మధ్య రైతులు,వినియోగదారులకు తాగునీటి సదుపాయం**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** వేసవి కాలంలో పెరుగుతున్న ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఎన్టీఆర్ నగర్ కూరగాయల మార్కెట్ యార్డులో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మార్కెట్ ఏజెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిలుక మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ...మార్కెట్‌కు వచ్చే రైతులు, వినియోగదారులు ఎండ వేడిని తట్టుకునేందుకు తాగునీటి సదుపాయం ఎంతో అవసరమని పేర్కొన్నారు. చలివేంద్రం ద్వారా వారి దాహార్తి తీర్చడంలో ఇది కీలకంగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన వర్తకులను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర చారి, సభ్యులు పన్యాల జైపాల్ రెడ్డి, బండి మధుసూదన్ రావు, మచ్చేందర్ రెడ్డి, గణేశ్ నాయక్, రఘుపతి రెడ్డి, నవరాజ్, మార్కెట్ కార్యదర్శి వహీద్ పాల్గొన్నారు. అలాగే మార్కెట్ ఏజెంట్స్ మధుసూదన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రఘు, గుడ్ల శ్రీనివాస్, లోకేష్, లక్ష్మారెడ్డి తదితరులు హాజరయ్యారు.

## ఓటర్ల సమగ్ర సవరణకు అందరూ సహకరించాలి



**మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్**

**సికింద్రాబాద్, విశాలభారతి :** భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాలను ప్రత్యేక సమగ్ర సర్వే ప్రక్షాళన కార్యక్రమాన్ని చేపట్టిందని ఇది సాధారణ సవరణ కంటే సమగ్రంగా ఉంటుందని మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ అన్నారు. సోమవారం బౌద్ధ నగర్ డివిజన్ ఎల్.నారాయణనగర్ లోని 168. పోలింగ్ బూత్ లో తార్నాక డిప్యూటీ కమిషనర్ జ్యోతి తో కలిసి తనిఖీ లో పాల్గొనడం జరిగిందని నకిలీ , మరణించిన, వలస వెళ్లిన ఓటర్ల పేర్ల తొలగింపు నకిలీ నమోదులు , శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లు తొలగిస్తారని డిప్యూటీ కమిషనర్ జ్యోతి అన్నారు .విదేశీ అక్రమ వలసదారుల గుర్తింపు పుట్టిన ప్రదేశం ఆధారంగా అక్రమ విదేశీయుల వలసదారులను ఓటర్ల జాబితా నుండి తొలగించడం ఒక ప్రధాన లక్ష్యమని 20 సంవత్సరాలకు ఒకసారి దేశవ్యాప్తంగా జరుగుతుందని నకిలీ ఓట్లు ప్రజాస్వామ్యానికి ముప్పని మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ అన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారికి కొత్త ఓటర్ల నమోదు అర్హులైన యువత, ఇతర అర్హులను చేర్చడం. జరుగుతుందని ఓటర్ల జాబితా సవరణకు అందరూ సహకరించాలని మాజీ కార్పొరేటర్ స్వరూపగౌడ్ అన్నారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు ఏఎంసీ మల్లికార్జున్, మోహన్ రెడ్డి, ప్రసాద్, రోజా, బిజెపి నాయకులు రవి ప్రసాద్ గౌడ్, రాజు గౌడ్, బబ్లు, బాబు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ గ్రామ, మండల కమిటీలు రద్దు



**షాద్ నగర్, విశాలభారతి:** నేటితో షాద్ నగర్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ గ్రామ,పట్టణ స్థాయి, మండల స్థాయి కమిటీలన్నీ రద్దయినట్లు తెలంగాణ ఫిషరీస్ చైర్మన్,సంఘటన్ సుజన్ అభియాన్ కమిటీ షాద్ నగర్ నియోజకవర్గ ఇంచార్జ్ మెట్టు సాయి కుమార్ విల్లడించారు.మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సంఘటన సుజన్ అభియాన్ కమిటీ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేస్తున్నామని అన్నారు. మే 2 నుండి 5వ తేదీ లోపు షాద్ నగర్ నియోజకవర్గంలోని గ్రామ మండల స్థాయి కమిటీలను పూరిస్థాయిలో ఎన్నుకోవడం జరుగుతుంది అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం ఆఫీసులో పని చేసిన వారికి మంచిది గుర్తింపు ఉంటుందని ,కష్టపడ్డ వారికి పదవులు దక్కుతాయన్నారు. గ్రామ మండల స్థాయి కమిటీల ఎంపికలో ఎలాంటి రికమండేషన్లు నడవవన్నారు.షాద్ నగర్ డివిజన్ లోనీ బ్లాక్ ఏ లో ఉన్న షాద్ నగర్ మున్సిపాలిటీ తో పాటు ఫరూక్ నగర్,కొందుర్గు,చౌదర్ గూడెం,అదేవిధంగా బ్లాక్ బీ లో ఉన్న కొత్తూరు మున్సిపాలిటీ తో పాటుగా కొత్తూరు మండలం, నందిగామ మండలం, కేశంపేట మండలాలకు మే 5 లోపు పార్టీ కమిటీ ల నియామకం పూర్తి అవుతుందని అన్నారు. మండల కమిటీ అనంతరం జిల్లా కమిటీల ఏర్పాటు ఉంటుందన్నారు.గతంలో ఎప్పుడూ లేనివిధంగా కాంగ్రెస్ పార్టీ కింది స్థాయిలో బూత్ లెవెల్ ఏజెంట్లను ఏర్పాటుచేసి ముందుకు పోతుంది అన్నారు.అనంతరం ఎంపీటీసీ,జడ్పిటిసి ఎన్నికలకు పార్టీ కార్యకర్తలను సిద్ధం చేయడమే ఈ కమిటీల లక్ష్యం అన్నారు.మండల అధ్యక్ష పదవి కోసం కనీసం పార్టీకి ఐదు సంవత్సరాలు సేవలందించిన వారిని ప్రామాణికంగా తీసుకుంటామన్నారు. అదేవిధంగా ప్రతి మండల కమిటీలో మహిళలకు అవకాశం కల్పించే విధంగా ముందుకు పోతున్నామన్నారు.ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీ ఖాన్ బాబర్,మాజీ బ్లాక్ అధ్యక్షులు బాలరాజ్ గౌడ్, చదువుకోడం మండల పార్టీ మాజీ అధ్యక్షులు రాజు, సీనియర్ నాయకులు వీర్లపల్లి మెహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

## మేడే కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

- కార్మిక చట్టాల నాలుగు కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్
- మే 1న భారీగా మేడే కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపు
- కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వానికి డిమాండ్



**సత్తుపల్లి, విశాలభారతి:** సిపిఎం సత్తుపల్లి పట్టణ కమిటీ సమావేశం రావి వీరవెంకయ్య భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్, జిల్లా నాయకులు మోరంపూడి పాండురంగారావు మాట్లాడారు.కార్మికుల మే 1 అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మేడే)ను ఘనంగా నిర్వహించాలని సిపిఎం పిలుపునిచ్చింది. స్వాతంత్ర్యం నాటి నుండి కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి, కార్మికులకు నష్టదాయకంగా మారిన లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.కార్మిక వర్గం చరిత్రలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ రోజున అన్ని రంగాల కార్మికులు, ఉద్యోగులు, రైతులు, కూలీలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, కార్మిక హక్కుల హననం వంటి సమస్యలపై పోరాటాన్ని మరింత బలపరచాల్సిన అవసరం ఉందని సిపిఎం పేర్కొంది.కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత వంటి హక్కులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానికంగా ర్యాలీలు, సభలు, జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు ఈ కార్యక్రమాల్లో పాల్గొని కార్మిక ఐక్యతను ప్రదర్శించాలని సిపిఎం నాయకులు శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు, సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు, మోరంపూడి వెంకట్రావు, చావా రమేష్, సైదా, రాము, ఓలేటి శ్రీహరి, చెరుకు రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఉచితంగా నాటు కోళ్లు పంపిణీ



**విశాలభారతి, కరక గూడెం:** మండలంలో కోనేరు సంస్థ పని చేస్తున్నటువంటి గ్రామ పంచాయతీ లలో రైతులకు కోనేరు సంస్థ ఆధ్వర్యంలో సమీకృత వ్యవసాయ పద్ధతి లో భాగంగా నాటు కోడి పిల్లల పంపిణీ కార్యక్రమం చేయడం జరిగింది. అనంతారం,పద్మాపురం, తాటిగూడెం, రేగళ్ళ, చిరుమళ్ళ, కన్నెగూడెం,భట్టుపల్లి గ్రామ పంచాయతీ లలో రైతులకి నాటు కోడి పిల్లలు పంపిణీ చేయడం జరిగింది. ఈ పంపిణీ కార్యక్రమం లో మండల కోఆర్డినేటర్ పగుట్ల వెంకటేశ్వరరావు కోడి పిల్లల పెంపకం లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు రైతులకి వివరించడం జరిగింది.ఈ విషయమై లబ్ధిదారి రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ కరక గూడెం మండలం లో చిన్న సన్నకారు రైతుల జీవనోపాధి మెరుగు పడటం కోసం కోనేరు సంస్థ చేస్తున్నటువంటి అద్భుతమైనటువంటి కార్యక్రమాలు, రైతులకు ఎంతో లాభ దాయకంగా ఉన్నాయని కోనేరు సంస్థ చేపట్టుతున్నటువంటి కార్యక్రమాల్లో తాము లబ్దిదారి రైతులు గా మమ్ములని గుర్తించి ఇటువంటి కార్యక్రమాలు చేస్తున్నటువంటి కోనేరు సంస్థ కు మరియు మండల కోనేరు సిబ్బంది కి మా రైతుల తరపున సంతోషాన్ని వ్యక్త పరుస్తూ అభినందనలు తెలియజేసారు. ఈ పంపిణీ కార్యక్రమం లో మండల కోఆర్డినేటర్ పగుట్ల వెంకటేశ్వరరావు లైవ్ లి వూడ్ ఎక్స్పర్ట్ ప్రణయ , క్లస్టర్ కోఆర్డినేటర్ లు నాగేశ్వరరావు,స్వాతి,మరియు సి ఆర్ పి లు నరేష్, కేశవరావు, సంపత్, హైమవతి, ఆదినారాయణ,రస్మా పాల్గొన్నారు.

## ఖల్‌నాయక్ రిటర్న్స్‌లో

# ఐటెం సాంగ్

సంజయ్‌దత్ నటించిన కల్ట్‌క్లాసిక్ 'ఖల్ నాయక్' చిత్రానికి ఇటీవలే సీక్వెల్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. 'ఖల్ నాయక్ రిటర్న్స్' పేరుతో ఇది తెరకెక్కనుంది. 'ఖల్ నాయక్'లోని 'చోళీ కే పీచే క్యా హై' పాట అప్పట్లో అత్యంత ప్రజాదరణ పొందింది. మాధురీ దీక్షిత్ నృత్యాలు యువతరాన్ని ఆకట్టుకున్నాయి. అదే సమయంలో ద్వందార్థాలతో కూడిన పాట ఇదనే విమర్శలు కూడా వచ్చాయి. ఇదిలావుండగా.. తాజా సీక్వెల్‌లో ఈ పాటను రీమిక్స్ చేయబోతున్నారట. ఇందులో తమన్నా నర్తించనుందని ప్రచారం జరుగుతున్నది. ఇప్పటికే తమన్నా పలు చిత్రాల్లో ఐటెంసాంగ్స్ చేసిన విషయం తెలిసిందే. రెండేళ్ల క్రితం 'స్త్రీ-2' చిత్రంలో తమన్నా చేసిన 'ఆజ్ కి రాత్' ప్రత్యేక గీతం విశేష ఆదరణ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో 'ఖల్ నాయక్ రిటర్న్స్'లో ఆమె పేరునే పరిశీలిస్తున్నారని బాలీవుడ్ టాక్.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.